# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com






అ దేశానికి చిరంజీవి.. ఎందుకంటే

...సినిమాలో



తెలంగాణ ఎడిటర్: విప్పల చంద్రశేఖర్ | గురువారం 14-11-2024 | పేజీలు: 8 | వెల : అమూల్యం


# అందుకే కులగణన చేపట్టాం

## ఒక మైలురాయిగా మిగులుతుంది

సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలకు చేరాలంటే ఏ ప్రభుత్వం వద్దనైనా సరైన గణాంకాలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకోసమే తెలంగాణలో కులగణన చేపట్టినట్లు వెల్లడించారు అభివృద్ధి - సంక్షేమం రెండింటినీ సమతుల్యం చేసుకుంటూ తెలంగాణలో సుపరిపాలన అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధిపై తమకు స్పష్టమైన విజన్ ఉందన్నారు.



- అందరికీ సమాన అవకాశాలు రావాలి
- కులగణన గేమ్ ఛేంజర్ కాబోతోంది
- తెలంగాణ సీఎం రేవంత్ వెల్లడి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

బుధవారం ఢిల్లీలో ఓ మీడియా ఛానెల్ నిర్వహించిన ప్రత్యేక చర్చా వేదికలో పాల్గొన్న ఆయన.. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్స్ వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఇప్పుడు తమ నినాదం రైజింగ్ తెలంగాణ అని.. చైనా ప్లస్ వన్ కంట్రీకి సరైన మార్గంగా చైనా ప్లస్ తెలంగాణ చూపిస్తున్నామన్నారు.

తెలంగాణలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం. సుపరిపాలన అందించడం తమ విధానం అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన గేమ్ ఛేంజర్ కాబోతోందన్నారు. సంక్షేమ ఫలాలు అసలైన అర్హులైన పేదలకు చేరాలంటే ప్రభుత్వం వద్ద సరైన గణాంకాలు ఉండాలని.. అసలు గణాంకాలు లేకుంటే అసలైన అర్హులకు న్యాయం చేయలేమన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వే చేపట్టామని.. అది ఒక మైలురాయిగా మిగులుతుందన్నారు.

(మిగతా 4వ పేజీలో)

# కేటీఆర్ అట్టర్ ఫ్లాప్ డైరెక్షన్!

## కలెక్టర్‌పై దాడి.. బీఆరెస్ స్టాండ్!

## అడ్డంగా బుక్కయిన పార్టీ..



కేసీఆర్ ఓ టైపు.. కేటీఆర్ మరో టైపు.. ఆయనోటైపు.. ఈయనో టైపన్నమాట. ఆయనేమో జనాలపై అలిగి ఫామ్ హౌజ్ కే పరిమితమయ్యాడు. ఈయనేమో గుడ్డెద్దు చేలో పడ్డట్టు.. పిచ్చోడి చేతిలో రాయిలా.. అనాలోచిత, అహంకారపూరిత నిర్ణయాలు తీసుకుంటూ పార్టీని మరింత ఇరకాటంలో పడేశాడు. ఇప్పుడివన్నీ ఎందుకంటారా..! వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గ పరిధిలో ఫార్మా విలేజ్ కోసం సర్కార్ చేపట్టనున్న భూసేకరణ కోసం అభిప్రాయ సేకరణ నిమిత్తం వెళ్లిన కలెక్టర్‌పై దాడి సంఘటన. ఇది పక్కా ప్లానింగ్ ప్రకారమే జరిగింది.



**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

బీఆరెస్ కార్యకర్త, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అనుచరుడు సురేశ్ దీంట్లో కీలక పాత్ర. అతడి కోసం పోలీసులు వెతుకుతున్నారు. పట్నం నరేందర్‌రెడ్డిని బుధవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యలపై ఎలాంటి సానుభూతి బీఆరెస్ పార్టీకి దొరకలేదు. అనుకున్నదొక్కటి అయ్యింది ఒక్కటి.. అన్నట్టుగా కేటీఆర్ చేసిన ఏ డైరెక్షన్ కూడా హిట్టు కాలేదు సరికదా యావరేజీ మైలేజీ కూడా రాకపోగా.. అట్టర్ ఫ్లాప్ అయి కూర్చింది ఇలా. ఏకంగా కలెక్టర్‌పైనే దాడికి తెగబడ్డ వైనాన్ని ఏ (మిగతా 2వ పేజీలో)



**కుంభకోణాలు బయటపెట్టేందుకే ఢిల్లీకి వెళ్లాను** 2



**వెయ్యి పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ మిడ్‌క్యాప్** 6

# ఇందిరా గాంధీ తిరిగొచ్చినా ఆర్టికల్ 370 పునరుద్ధరించబోం

## కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా



కేంద్రపాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. దివంగత ఇందిరా గాంధీ స్వర్గం నుంచి తిరిగొచ్చినా.. ఆర్టికల్ 370 పునరుద్ధరించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల

(మిగతా 4వ పేజీలో)

# ప్రధాని మోదీ పాదాలను తాకేందుకు నితీష్ కుమార్ ప్రయత్నం

బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తన అనూహ్య ప్రవర్తనతో మరోసారి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. దర్భంగాలో జరిగిన ఓ కార్య క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ కాళ్ల ను నమస్కరించేందుకు నితీష్ కుమార్ ప్రయత్నించారు.



**పాట్నా:** బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తన అనూహ్య ప్రవర్తనతో మరోసారి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. దర్భంగాలో జరిగిన ఓ కార్య క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ కాళ్ల ను నమస్కరించేందుకు నితీష్ కుమార్ ప్రయత్నించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బిహార్‌లోని దర్భంగా ప్రాంతంలో ఎయిమ్స్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసి, రూ.12,100 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం నితీష్ కుమార్.. ప్రధాని మోదీ వైపు నడుస్తూ రెండు చేతులు జోడించి నమస్కరించారు. అనంతరం వెంటనే మోదీ పాదాలను తాకేందుకు ప్రయత్నించారు. గమనించిన ప్రధాని.. తన పాదాలను తాకకుండా సీఎంను ఆపారు. నితీష్‌కు కరచాలనం అందించారు.

అయితే మోదీ పాదాలను నితీష్ తాకడం ఇదేం తొలిసారి కాదు. గత జూన్‌లో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రధాని కాళ్లకు నమస్కరించేందుకు ఆయన ప్రయత్నించారు. అంతకముందు ఏప్రిల్‌లోనూ నవాడాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో నితీష్ కుమార్.. మోదీ కాళ్లను ముట్టుకున్నారు.



## అత్యంత శక్తిమంతుడు ప్రధాని మోదీ 2

దేశంలో రాజకీయంగా ప్రధాని నరేంద్రమోదీ అత్యంత శక్తిమంతుడిగా ఉన్నట్లు ఇండియా టుడే ప్రకటించింది. ఆ తర్వాతి స్థానాల్లో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్, హెూంమంత్రి అమిత్‌షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఉన్నట్లు తెలిపింది.

# కుల గణన పేరుతో ప్రజల ఆస్తిపాస్తులపై కన్నేశారు

## రేవంత్ ప్రభుత్వంపై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం (నవంబర్ 13) నాగ్ పూర్ లో పర్యటించారు కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్. ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడిన ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి సంజయ్ తెలంగాణ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన కుల గణన కార్యక్రమం ప్రజల ఆస్తిపాస్తులు కాజేయడానికేనంటూ వ్యాఖ్యానించారు. (మిగతా 4వ పేజీలో)

# తోటి మనిషి బాగు కోరుకోవడమే కాళోజీకి అందించే ఘన నివాళి



## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. మహెూన్నతమైన తెలంగాణ అస్తిత్వాన్ని, సాహిత్య సాంస్కృతిక గరిమను ప్రపంచానికి చాటేందుకు (మిగతా 4వ పేజీలో)

# కలెక్టర్‌పై దాడిని కేటీఆర్, డీకే అరుణ సమర్థిస్తారా?

## మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**



ప్రతిపక్షాలకు ప్రతి అంశంపై నిరసన తెలిపే హక్కు ఉంటుందని, ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం(నవంబర్ 13) సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద పొన్నం మీడియాతో మాట్లాడారు.'ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. బీజేపీ,బీఆర్ఎస్ నాయకులు అయినా చట్టం లోబడే పనిచేయాలి.ప్రతిపక్ష నేతలు ఫ్రస్ట్రేషన్‌లో మాట్లాడుతున్నారు.అధికారుల పై దాడి జరిగితే ఖండించాల్సింది పోయి..సమర్థించినట్లు డీకే అరుణ,కేటీఆర్ వ్యాఖ్యలున్నాయి.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా చర్యలు ఉంటే సహించేది లేదు.ప్రజా స్వామ్యన్ని అందరూ గౌరవించాలని విజ్ఞప్తి చేస్తున్నా'అని పొన్నం కోరారు.

ప్రజాభూమి

# ఐటీ ఎగుమతుల్ని పెంచేందుకు ప్రణాళిక

## ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

రానున్న నాలుగైదేళ్లలో హైదరాబాద్‌ను ఐటీ రంగంలో జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఐటీ రంగ ఎగుమతుల్ని 12 నుంచి 20 శాతానికి పెంచే ప్రణాళికతో తమ సర్కారు ముందుకెళ్తోందన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని డీఎల్‌ఎఫ్ ఐటీ పార్కులో హిటాచీ గ్రూప్‌నకు చెందిన 'గ్లోబల్ లాజిక్' డిజిటల్ ఇంజినీరింగ్ కంపెనీ నూతన కార్యాలయాన్ని ఆ సంస్థ ఎండీ పీయూష్ ఝాతో కలిసి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, బహుళ జాతి సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. రాష్ట్రంలో పెద్ద సంస్థల తోపాటు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు తోడ్పాటు ఇచ్చేలా ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఐటీ, పామాయిల్ పరిశ్రమలు నెలకొల్పడానికి మలేసియాలోని తెలు గు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలో నగరంలో ఏఐ సిటీని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గ్లోబల్ లాజిక్ మేనేజింగ్ డైరెక్టర్ పీయూష్ ఝా మాటా డుతూ.. కంటెంట్ ఇంజినీరింగ్



వ్యాపారంపై నిరంతర దృష్టి కొనసాగిస్తూనే టెక్నాలజీ, హెల్త్‌కేర్, ఆటోమోటివ్, బ్యాంకింగ్, ప్రొఫెషనల్ సర్వీసెస్ సహాయ పలు రంగాల్లో అధునా తన డిజిటల్ ఇంజినీరింగ్ పరిష్కారాలు అందించడానికి కార్యాలయ విస్తరణ దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత శక్తిమంతుడు ప్రధాని మోదీ

## తర్వాతి స్థానాల్లో మోహన్ భాగవత్, అమిత్‌షా, రాహుల్‌గాంధీ








### ముఖ్యమంత్రుల్లో అగ్రస్థానంలో చంద్రబాబు

### ఇండియాటుడే జాబితాలో వెల్లడి

**దిల్లీ:** దేశంలో రాజకీయంగా ప్రధాని నరేంద్రమోదీ అత్యంత శక్తిమంతుడిగా ఉన్నట్లు ఇండియా టుడే ప్రకటించింది. ఆ తర్వాతి స్థానాల్లో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్, హెూంమంత్రి అమిత్‌షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఉన్నట్లు తెలిపింది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోని అత్యంత శక్తిమంత నాయకుల్లో ఐదో స్థానంలో, ముఖ్యమంత్రుల్లో అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. 2024లో దేశంలో ఉన్న రాజకీయ పరిస్థితులు, నాయకుల పనితీరు ఆధారంగా వారి శక్తిసామర్థ్యాలను అంచనా వేసింది. 'ప్రధాని మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికై.. 60 ఏళ్ల రికార్డును తిరగరాశారు. ఒకవైపు అమెరికాతో.. మరోవైపు రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయెల్ అధినేతలతో ఏకకాలంలో స్నేహసంబంధాలు కొనసాగిస్తూ భారత ఆర్థిక వ్యవస్థను 4 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లారు' అని విశ్లేషించింది.



వరుసగా రెండు ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్ష హెూదా కోల్పోయిన కాంగ్రెస్‌పార్టీకి ఆ హెూదాను తిరిగి తెచ్చిన నాయకుడిగా రాహుల్‌గాంధీ గుర్తింపు పొందారు.



దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యంత శక్తిమంతుడిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తింపు పొందారు. 2019 ఎన్నికల్లో ఓటమితో రాష్ట్రంలో అధికారం కోల్పోయి, జైలుకెళ్లినా... 2024 ఎన్నికల్లో ఫీనిక్స్ పక్షిలా ఎగిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బలమైన పట్టు సాధించారు. సొంతంగా 16 మంది లోక్‌సభ సభ్యులు, కూటమిపార్టీలతో కలిపి రాష్ట్రంలో 21 మంది ఎంపీలను గెలిపించుకొని ఎన్డీయేలో తెదేపాను రెండో పెద్దపార్టీగా నిలపగలిగారు. దేశంలో ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రుల్లో అత్యంత సీనియర్‌గా ఉన్న చంద్రబాబు.. రాష్ట్ర పరిపాలనపైనా తనదైన ముద్రచూపుతూ ముందుకెళ్తున్నారు. తర్వాతి స్థానాల్లో బిహార్ సీఎం నీతీశ్‌కుమార్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, తమిళనాడు సీఎం స్టాలిన్, పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ తదితరులున్నారు.

కేంద్రంలో ప్రధాని మోదీ తర్వాత అత్యంత శక్తిమంతుడిగా పేరొందిన అమిత్‌షా.. ఈ జాబితాలో దేశంలో మూడో శక్తిమంత నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రధానమంత్రికి కళ్లు, చెవుల్లా పనిచేస్తున్నారు. కేంద్రం తీసుకొనే ప్రతీ నిర్ణయం ఈయన ఆమోదం తర్వాతే ముందుకెళ్తోంది.

# కేటీఆర్ అట్టర్ ఫ్లాప్ డైరెక్షన్!

(మొదటి పేజీ తరువాయి)

సెక్షను కూడా అంగీకరించలేదు. తీవ్రంగా వ్యతిరేకించారు. కలెక్టర్లపైనే దాడులకు తెగబడితే ఇంకా ఏమన్నా ఉందా..? దీనిపై కఠినంగా వ్యవహరించాలనే దోరణి అంతటా ఉంది. కాగా అధికారులపై దాడి విషయంలో కేటీఆర్ మౌనం ఆ పార్టీకి మరింత నష్టం చేకూర్చేలా తయారయ్యింది. ఇదే అంశాన్ని రేవంత్‌రెడ్డి లేవనెత్తాడు. అధికారులపై దాడులు జరిగితే ఖండించరా.. పైగా దాడులు చేసిన వారి వద్దకు వెళ్లి పరామర్శిస్తారా..? వెనుకుండి ఇదంతా చేయడమే కాకుండా.. కలెక్టర్‌పై దాడి జరిగినా మంచిగా జరిగింది. వారు కడుపు మంటతో అలా చేశారంటూ పరాచికాలాడుతారా? అని నిలదీయడం ఆ పార్టీకి మరింత ఇరకాటంలో పెట్టింది. ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యేలకు వరుసగా నోటీసులు జారీ అవుతున్న తరుణంలో .. వికారాబాద్ ఇష్యూలో బీఆరెస్ తీసుకున్న నిర్ణయం, వేసిన స్టెప్స్ పూర్తిగా బూమరాంగ్‌గా మారాయి. అటు అధికారుల నుంచి కూడా బీఆరెస్ పార్టీ పట్ల, కేటీఆర్ వ్యవహార శైలి పట్ల తీవ్ర వ్యతిరేకత రాగా.. అధికారులతో బీఆరెస్ పార్టీకి మరింత అంతరం పెంచుకున్నట్టయ్యింది. ఇక పొలిటికల్ మైలేజీ కోసం అంగలార్చిన కేటీఆర్‌కు.. ఇది మరింత చేదు అనుభవాన్ని , మరకను మిగిల్చింది. దాడులు చేసిన లంబాడాలైతే తండాలు ఖాళీ చేసి పారిపోయారు. అంత సీరియస్‌గా యాక్షన్ మొదలు పెట్టింది సర్కార్. పట్నం నరేందర్‌రెడ్డిపై పలు కేసులు పెట్టి జైలుకు పంపే యోచనలో సర్కార్ ఉంది. ఇలా చేసినా ఏ సెక్షన్ నుంచి కూడా కనీస సానుభూతి కూడా ఆ పార్టీకి లభించే అవకాశాలు లేకపోవడం కేటీఆర్ తీసుకున్న అనాలోచిత, దుందుకుడు నిర్ణయాలకు బలైపోయే సంఘటనలో ఇదో ఉదాహరణ మాత్రమే.

# కుంభకోణాలు బయటపెట్టేందుకే ఢిల్లీకి వెళ్లాను

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

నేను ఢిల్లీకి వెళ్లింది అనుముల కుటుంబ కుంభకోణాలు బయటపెట్టేందుకు వెళ్లాను. మళ్లీ కూడా కుంభకోణాలను బయటపెడుతూనే ఉంటానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు, పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్ అంశం, రాష్ట్రంలో భూసేకరణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న దురాగతాలపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. నేను ఢిల్లీకి వెళితే బీజేపీతో కాళ్ల బేరానికి వెళ్లినట్లా..? మరీ బీజేపీకే చెందిన గవర్నర్‌ను రేవంత్ రెడ్డి కలిస్తే అది కాళ్ల బేరానికి వెళ్లినట్లు కాదా..? అదానీ కాళ్లు పట్టుకొని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన మీద ఈడీ కేసు కాకుండా చూసుకున్నాడా..? లేదా..? చెప్పండి. నేను మలేషియా వెళ్లకుండానే వెళ్లినట్లు మీడియా వాళ్లు ఎలా రాస్తారు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ తుగ్లక్ ప్రభుత్వం నిర్ణయం కారణంగా అధికారులు బలి అవుతున్నారు. ప్రభుత్వం కుట్రలో అధికారులు బలి కావద్దని కోరుతున్నా. కొడంగల్‌లో రైతులతో భూసేకరణ పంచాయితీ వచ్చినప్పుడు పిలిచి మాట్లాడని కుసంస్కార ప్రభుత్వం ఇది. మా ప్రభుత్వంలో కూడా భూ సేకరణ సమస్యలు వస్తే రైతులను మెప్పించి ఒప్పించి, వాళ్ల కడుపులో తల పెట్టి మేము మంచి పరిహారం ఇచ్చాం. మల్లన్న సాగర్ వంటి ప్రాజెక్టును పూర్తి చేశాం. కానీ ఈ ముఖ్యమంత్రికి 9 నెలలుగా కొడంగల్‌లో ఆందోళన చేస్తున్న రైతులను కలిసే సమయం లేదని కేటీఆర్ మండిపడ్డారు. కలెక్టరే స్వయంగా దాడి జరగలేదని చెబుతున్నాడు. ఐజీ మాత్రం దాడి జరిగిందంటున్నారు. కానీ ఇది ఇంటలిజెన్స్ వైఫల్యం. దాడి జరుగుతున్న సమయంలో సెక్యూరిటీ ఏదీ? ఉద్దేశ పూర్వకంగా గొడవ సృష్టించి రైతులు భూసేకరణకు సహకరించటం లేదని భూములను



గుంజుకునే కుట్ర చేస్తున్నారు. ముఖ్యమంత్రికి రియల్ ఎస్టేట్ ఫార్ములా, బ్యాగ్‌ల ఫార్ములా మాత్రమే తెలుసు. ఈయనకు ఈ రేస్ అంటే ఏంటో తెలుసా..? అని ప్రశ్నించారు. 11 నెలలుగా రోజుకో కుంభకోణం పేరుతో టైంపాస్ ప్రచారం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని మీడియా కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. మేము తప్పకుండా లగచర్ల రైతులకు అండగా ఉంటాం. ఆ ప్రాంతానికి మా పార్టీ నాయకులం వెళ్తాం. పీడిత, గిరిజన రైతులకు మేము కచ్చితంగా అండగా నిలబడతాం. లంబాడా హక్కుల సమితి వాళ్లను కూడా కలిసి వాళ్లతో పోరాటం చేస్తాం. భూ సేకరణ పేరుతో రేవంత్ రెడ్డి కుటుంబం చేస్తున్న దోపిడీ ప్రజల ముందు పెడతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# లిక్కర్ అమ్మకాలపై రేవంత్‌రెడ్డికి ప్రేమ ఎక్కువైంది

**ప్రజాభూమి ప్రతినిధి, నల్లగొండ :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ మధ్య మద్యం అమ్మకంపై ప్రేమ ఎక్కువైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు పరిశీలించారు.వడ్లు కొనకపోతే అధికారులను మిల్లర్లను ఎందుకు కొనట్లేదని అడగడం లేదు కానీ.. మందు తక్కువ అమ్మిన ఎక్సైజ్ అధికారులకు మెమోలు ఇస్తున్నారు. మందు అమ్మకాల టార్గెట్ పెట్టి జనాలకు మందు ఎక్కువ తాగించి ఆదాయం పెంచాలని ఒత్తిడి చేస్తూ మెమోలిస్తూ ట్రాన్స్‌ఫర్లు చేస్తున్నారు. 25 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు మెమోలు జారీ చేశారు. తెలంగాణను తాగుబోతుల తెలంగాణ చేయాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు. ప్రజల ప్రాణాలు పోయినా పర్వాలేదు కానీ మద్యాన్ని ఏరులై పారిస్తామని కంకణం కట్టుకున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు.తెలంగాణలో ఆడబిడ్డలకు రూ. 2500 ఇస్తానని ఎన్నికల హామీ ఇచ్చావు కానీ విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేసి మహిళల పుస్తెలు తెంపుతున్నావ్. మహిళలకు లక్ష కోట్ల వడ్డీ లేని



రుణమిస్తామని చెప్పి మోసం చేసావ్. వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మహిళలకు అందజేయడం లేదు. భర్తలకు మద్యం తాగించి ఇల్లు గుల్ల చేయాలని చూసి మహిళలను ఇబ్బంది పెడుతున్నావ్.ముఖ్యమంత్రి ప్రజల గురించి కాకుండా పైసల గురించి మాత్రమే ఆలోచిస్తున్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు.రైతులకు పెట్టుబడి సాయం అందిందా లేదా రుణమాఫీ జరిగిందా లేదా సకాలంలో బోనస్ అందించారా లేదా, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేశారా లేదా అనే సోది లేదు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని ప్రభుత్వం ప్రకటించింది కానీ ప్రభుత్వ పరిస్థితి చూస్తుంటే 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనే పరిస్థితి లేదు. పక్క రాష్ట్రం నుంచి దళారుల వచ్చి తెలంగాణలో రైతుల వద్ద తక్కువ రేటుకు ధాన్యాన్ని కొంటున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టు పెట్టి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని మోసం చేశావ్. రేవంత్ రెడ్డి రాజ్యంలో రైతులు దుఃఖపడుతున్నాడు. ధాన్యం కొనుగోలులోనే కాదు పత్తి కొనుగోలు విషయంలోనూ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ. 15000 రైతుబంధు రైతులకు ఇవ్వాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.



# పట్టాలు తప్పిన గూడ్సు.. 39 రైళ్లు రద్దు

**ప్రజాభూమి ప్రతినిధి, పెద్దపెల్లి :**

గూడ్స్ రైలు ప్రమాదంతో కాజీపేట-బలార్ష రూట్(ఢిల్లీ-చెన్నై) రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ మార్గంలో ఎటువైపు రైలు అటువైపు నిలిచిపోయాయి. వందేభారత్ సహా పలు రైళ్లు రద్దు కాగా, మరికొన్నింటిని దారి మళ్లించారు. ఇంకొన్నింటిని రీషెడ్యూల్ చేశారు. పునరుద్ధరణకు ఒక్కరోజు పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారుసమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు. క్లియరెన్స్‌కు మరో 24 గంటల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన రాఘవాపూర్ స్టేషన్ వద్దకు ఈ ఉదయం దక్షిణ మధ్య రైల్వే అధికారులు చేరుకుని పునరుద్ధరణ పనులను ముమ్మరం చేయించారు.ట్రాక్స్ పునరుద్ధరణకు ప్రత్యేక మిషనరీ తెప్పించారు. బల్లార్షా, కాజీపేట, సికింద్రాబాద్ నుంచి సుమారు 500 మంది సిబ్బందిని తీసుకొచ్చి రైల్వే ట్రాక్స్ పునరుద్ధరణ పనుల్లో స్పీడ్ పెంచారు. ట్రాక్స్ పై అదుపు తప్పి కిలోమీటర్ మేర చెల్లాచెదురుగా పడిన బోగీలను భారీ క్రేన్స్ సాయంతో తొలగిస్తున్నారు.

### రద్దు.. డైవర్షన్.. రీషెడ్యూల్

ఇదిలా ఉంటే.. దక్షిణ మధ్య రైల్వే 31 రైళ్లు రద్దు చేయడంతో పాటు 10కి పైగా రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. కొన్నింటిని దారి మళ్లించింది. ఇంకొన్ని రైళ్లను రీషెడ్యూల్ చేసింది. ప్రయాణికులంతా ఇది గమనించాలని.. ఏమైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించాలని సూచించింది. నర్సాపూర్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-నాగ్‌పుర్, హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్-కాగజ్‌నగర్, కాజీపేట-సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్-కరీంనగర్, కరీంనగర్-బోధన్, సిర్పూర్ టౌన్-భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-బల్లార్షా, బల్లార్షా-కాజీపేట, యశ్వంత్‌పూర్-ముజఫర్‌పూర్ రైళ్లను రద్దు



చేశారు.అలాగే.. రామగిరి ఎక్స్ ప్రెస్, సింగరేణి ఎక్స్ ప్రెస్, వందే భారత్ ఎక్స్ ప్రెస్, బీదర్ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్, కాగజ్ నగర్ ఎక్స్ ప్రెస్‌లను రద్దు చేశారు.దారి మళ్లించిన రైల్వే వివరాలు జీటీ, కేరళ, ఏపీ, గోరఖ్ పూర్, సంఘమిత్ర, దక్షిణ్, పూణే, దర్భంగా ఎక్స్ ప్రెస్

### ఏం జరిగిందంటే..

మంగళవారం నిజామాబాద్ నుంచి ఘజియాబాద్ వైపు 43 వ్యాగన్లతో ఐరన్ కాయల్స్ లోడుతో వెళుతున్న గూడ్స్ రైలులోని 11 వ్యాగన్లు పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్%-%కన్నాల గేట్ మధ్యలో 282/35 పోల్ వద్ద పట్టాలు తప్పాయి. రైలు ఇంజిన్, గార్డ్ వ్యాగన్ పట్టాలు తప్పలేదు. దీంతో.. ఈ ప్రమాదం నుంచి లోకోపైలెట్లు ఇద్దరు, గార్డు సురక్షితంగా బయటపడ్డారు. రైలు ఇంజిన్‌వైపు ఉన్న 8 వ్యాగన్లతోసహా గూడ్స్‌ను రామగుండంకు తరలించారు. ప్రమాద తీవ్రతకు పట్టాలు విరిగిపోయి చెల్లాచెదురయ్యాయి. కరెంట్ పోల్స్ సైతం విరిగిపోయాయి. వ్యాగన్లు ఒక్కదానిపైకి ఒక్కటి ఎక్కడంతో ట్రాక్ పునరుద్ధరణ పనులు కష్టంగా మారాయి. భాగ్యనగర్ రైలు రాఘవాపూర్‌కు చేరుకోగా, దానిని వెనుకకు మళ్లించి పెద్దపల్లిలో ప్రయాణికులను దింపివేశారు.

దీంతో మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, ఓదెల, జమ్మికుంట తదితర రైల్వే స్టేషన్లలో రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పటికప్పుడు.. వరంగల్ వైపు వెళ్లే మరికొన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రామగుండం, మంచిర్యాల రైల్వేస్టేషన్లలో నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై రైల్వే ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. .



# ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ప్రజాభూమి**

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల పెంపుపై సంబంధిత అధికారులతో సిరిసిల్ల కలెక్టరేట్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈడిడి ఆధారంగా గర్భిణీ మహిళలను ఫాలో అప్ చేయాలన్నారు. వైద్యుల ఖాళీలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



# క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్

**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ**

కార్తీక మాసం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని ప్రభుత్వ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొగుట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో కార్తీక మాసం సందర్భంగా స్వామీ వారు నిర్వహించిన అనుగ్రహ భాషణం, పుష్పార్చన సామూహిక దీపోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

# సిరిసిల్లలో ఆగని ఆత్మహత్యలు

## అప్పుల బాధ తాళలేక

## మరో నేత కార్మికుని ఆత్మహత్య

**ప్రజాభూమి ప్రతినిధి, సిరిసిల్ల**

ఆర్థిక ఇబ్బందులు తాళలేక మరో నేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సిరిసిల్ల పట్టణంలోని 22వ వార్డు గణేష్ నగర్ కి చెందిన ఎర్రం కొమ్రయ్య (55) అనే వ్యక్తి ఇంట్లో ఊరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత 8 నెలల నుండి ఉపాధి లేకపోవడం తో ఆర్థిక ఇబ్బందుల వలన తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య కమల, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, సాయి కిరణ్, కూతురు వరలక్ష్మి ఉన్నారు.

# రాజన్న సేవలో తొగుట పీఠాధిపతి



**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ**

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని బుధవారం తొగుట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. భగవంతుడు ఇచ్చిన మానవ జన్మను సార్థకం చేసుకోవాలని తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతి అన్నారు. కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి శ్రీ మాధవానంద సరస్వతి ప్రవచనాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం భక్తులతో కోలాహాలంగామారింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు పర్య వేక్షించారు. వారి వెంట ఆలయ ఈవో వినోద్ రెడ్డి, ఆలయ అర్చకులు, అధికారులు ఉన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

## వివాహానికి హాజరైన ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ..



**ప్రజాభూమి ప్రతినిధి, కరీంనగర్:**

కాంగ్రెస్ పార్టీ టీపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏం ఏ సమద్ నవాబ్ కుమారుడు,ఎంఏ అహాద్ నవీద్ సోదరుడు ఎం ఏ హలీం నవాజ్ వివాహ రిసెప్షన్ వేడుకలు కరీంనగర్ లోని వీ కన్వెన్షన్ హాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకల్లో రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు విజయ రమణారావు,వడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ రిసెప్షన్ లో దాదాపు 7వేల మందిని పిలిచి అద్భుతమైన విందు ఏర్పాట్లు చేశారు. ఈ పలు పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# గ్రామాల్లో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు




**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం**

యువత లో క్రీడా స్ఫూర్తిని పెంపొందింప జేసీ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన క్రీడాకారులను తయారు చేయడం కోసం యువత లో ఉత్సాహాన్ని నింపేందుకు గాను గత ప్రభుత్వం మండలం లో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు కొన్ని గ్రామాల్లో ఊరి కి దూరంగా, మరియు నిరుపయోగంగా మారాయి. కేవలం బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు గ్రామీణా క్రీడా కారులకు ఎలాంటి ప్రోత్సాహం లేకుండా పోయింది. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను తీర్చిదిద్దాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో కనీస వసతులు, పరికరాలు లేక పట్టించుకోని పరిస్థితి నెలకొంది. అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. ఉపాధి హామీ పథకం కింద లక్షలు రూపాయలు ఖర్చు చేసిన వాటికి సరైన వసతులు కల్పించక పోవడంతో క్రీడా ప్రాంగణాలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. మరి కొన్ని గ్రామాల్లో ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు అటువైపు ఇప్పటి వరకు కూడా కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు, చెట్లు, గడ్డి పేరుకుపోయి అస్తవ్యస్తంగా తయారైయ్యాయి. పలు గ్రామాల్లో ఊరికి దూరంగా, ఎత్తు వంపుల స్థలాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నూతన ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకుని వచ్చి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని పలువురు క్రీడా కారులు కోరుతున్నారు.

# ప్రజా కవి కాళోజినారాయణరావుకు ఘన నివాళులు



**ప్రజాభూమి ప్రతినిధి, జమ్మికుంట**

ఉద్యమమే ఊపిరిగా చివరి వరకు పోరాటం చేసిన ప్రజాకవి కాలోజీ నారాయణరావు అని ప్రముఖ వ్యాపారి సామాజికవేత్త ఎం శ్రీనివాస్ కుమార్ అన్నారు. బుధవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర్భంగా కాళోజీ విగ్రహానికి జమ్మికుంటలో శ్రీనివాసరావు నివాళు లు అర్పించారు. ఈ సందర్బంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ సమాజంలో అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడని సగర్వంగా చెప్పిన సాహితీ ఉద్యమ నేత కాలోజీ నారాయణరావు అని వివరించారు. ప్రత్యేక తెలంగాణ కొరకు ఎలుగెత్తి తన భావ ప్రకటన చేసి జనాన్ని జాగృతం చేసిన మహనీయుడని కొనియాడారు.

పుట్టుక నీది చావు నీది అంటూ బ్రతుకంతా దేశం కోసం అంటూ చాటిన మహనీయుడని శ్రీనివాస్ కుమార్ కొనియాడారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే వసతిగృహంలో ముద్దల అన్నం కథనానికి స్పందన

## తనిఖీ చేసిన ఆర్ సీవో అంజలి

**ప్రజా భూమి ప్రతినిధి, తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో గల జ్యోతిబా పులే బాలుర హాస్టల్లో ఆహారం బాగాలేదు అని బుధవారం వచ్చి న వార్త కథనాలకు స్పందించి పాఠశాలను ఆర్ సీ ఓ అంజలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంట చేసే కార్మికులతో మాట్లాడి పలు కారణాలు తెలుసుకున్నారు. బియ్య ం కొత్తవి కావడంతో ఇలా జరిగిందని మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని తెలి పారు విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పిల్లలతో కలి సి భోజనం చేశారు . పాఠశాలను తనిఖీ చేసిన వారిలో ఆర్‌సి ఓ అంజలితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# ఆర్థిక సాయం అందజేత

**ప్రజాభూమి ప్రతినిధి ముస్తాబాద్**

ముస్తాబాద్ పట్టణ కేంద్రంలోని బొంగుని లక్ష్మి-కనకరాజు ల కుమార్తె వివాహం ఉండగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కనమేని చక్రధర్ వారి కుటుంబానికి క్వింటల్ బియ్యం, 5000/- రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో అలుగుల రాజేశం, దీటి నర్సింలు, బండి శ్రీకాంత్, షాదుల్ పాపా, తోట ధర్మేందర్, సద్ది మధు, నరసింహులు, వేముల వెంకట్, మచ్చ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

## సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్సై చిందం గణేష్

**ప్రజా భూమి ప్రతినిధి, ముస్తాబాద్**

ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో గౌడ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన 5 సీసీ కెమెరాలను ముస్తాబాద్ ఎస్సై చిందం గణేష్ ప్రారంభించారు. దేవాలయాల్లో దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా వాటిని అరికట్టేందుకు అన్ని గ్రామాల వారు ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఆలయాల్లో సిసి కెమెరాలను విరాళంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటే అభినందనీయం అన్నారు. అనంతరం గౌడ సంఘం సభ్యులను ఎస్సై గణేష్ అభినందించారు.



# పరామర్శ

**ప్రజాభూమి ప్రతినిధి, గంగాధర**

గంగాధర గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు రవీంద్రనాథ్ ఠాగూర్ కాలుకి ఇటీవలే ఆపరేషన్ కాగా ఆయనను వారి నివాసంలో బుధవారం గంగాధర మాజీ జడ్పీటీసీ ఆకుల మధుసూదన్, కొండన్నపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రెండ్ల శ్రీనివాస్ పరామర్శించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. అధైర్య పడొద్దని , ధైర్యంగా ఉండాలని సూచించారు.



# క్షయ వ్యాధి నిర్మూలనపై శిక్షణ కార్యక్రమం

**ప్రజా భూమి ప్రతినిధి, వేములవాడ రూరల్**

వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంపాక్ట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా టిబి చాంపియన్ శిక్షణను జిల్లా అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధితో పోరాడి గెలిచిన వారిని ఎంపిక చేసి వారికి క్షయ వ్యాధి నివారణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. శిక్షణ ఇచ్చిన అనంతరం వారిచే గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రజాభూమి



# కొనసాగుతున్న అంబేద్కర్ జంక్షన్ సుందరీకరణ పనులు

**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వెనుక భాగంలో నిర్మిస్తున్న అంబెడ్కర్ జంక్షన్ సుందరీకరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడం కోసం పట్టణంలో ఆకర్షణీయంగా సుందరీకరణ పనులు చేపడుతున్నామని స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గతంలో పేర్కొన్నారు. ఈ జంక్షన్ పూర్తయితే రాజన్న భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం సంతరించుకోనుంది.



# పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది

## సాటి మనిషి బాగు కోరుకోవడమే కాళోజికి అందించే ఘన నివాళి :- ఎమ్మెల్యే కవ్వంపల్లిలి

**ప్రజాభూమి ప్రతినిధి, తిమ్మాపూర్**

నిజాం అరాచక పాలన, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప కలం యోధుడు కాళోజీ నారాయణరావు అని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం కాళోజీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులర్పిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిజాం అకృత్యాలపై కలంతో పోరాడిన బలశాలి కాళోజీ అని ఆయన పేర్కొన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణ రావు తాను బతికినంత కాలం ప్రజల గొంతుకగా పని చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాళోజీ పోషించిన పాత్ర మరువలేదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు. తన రచనలు, సాహిత్యంతో తెలంగాణ సమాజాన్ని జాగృతపర్చిన నిత్య చైతన్యశీలి కాళోజీ అని ఆయన కీర్తించారు.కాళోజీ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. ప్రజల హక్కులపై పాలకులను నిగ్గదీశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

# కథలొద్దు కేటీఆర్..

## దమ్ము, ధైర్యం ఉంటే మోడీకి వ్యతిరేకంగా మహారాష్ట్రలో ప్రచారం చేయ్

## అధికారం పోయినా పొగరు వంగలే..

## అమృత్ టెండర్లు బీ హయాంలోనివే..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శిస్తే సహించేది లేదు..

## కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు



**ప్రజాభూమి ప్రతినిధి, కరీంనగర్..**

తెల్లారిలేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విషం చిమ్మడం మాజీమంత్రి కేటీఆర్ కు అలవాటుగా మారిందని, ఈ పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు హెచ్చరించారు.

బుధవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ దమ్ము, ధైర్యం ఉంటే మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని సవాల్ విసిరారు. ఆ దమ్ము లేకనే మహారాష్ట్రలో కాంగ్రెస్ కు ఓటు వేయొద్దని కేటీఆర్ చెబుతున్నారని, అంటే బిజెపితో వారికి లాలూచీ ఉందన్న విషయం స్పష్టంగా బయటపడుతున్నదని పేర్కొన్నారు. చివరికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన శరత్ పవర్ తరఫునైనా మహారాష్ట్రలో ప్రచారం చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం, లోక్ సభ ఎన్నికల్లో సీట్లు కోల్పోయినా వారిలో పాయచిత్తం కనిపించడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ నేతల నాటకాలన్నీ ప్రజలు గమనిస్తున్నారని, అధికారం కోల్పోయినా వారి పొగరు వంగలేదని మండిపడ్డారు. ఉనికిని చాటుకునేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు.

తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే రోల్ మోడల్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీర్చిదిద్దుతుంటే, బీఆర్ఎస్ నేతలు దీన్ని ఒర్వడం లేదని విమర్శించారు. ప్రజల్లో ఎక్కడ తమ ఉనికి కనపడకుండా పోతుందనే భయంతోనే ఇలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ తెచ్చింది అసలైన ఫార్ములా ఈ కాదని అది పెద్ద బోగస్ అని రాజేందర్ రావు ఆరోపించారు.

ఫార్ములా ఈ రేస్ కు 55 కోట్ల కేటాయింపు పై ఏసీబీ కేసు నమోదు, విచారణకు గవర్నర్ అనుమతి కోరడంతో కేటీఆర్ లో భయం పుట్టిందని మండిపడ్డారు. దాన్నుంచి తప్పించుకునేందుకే ఢిల్లీకి పరుగులు పెట్టారని పేర్కొన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రాపకానికి నానా తండాలు పడుతున్నారని ఆరోపించారు. ఎన్ని నాటకాలు వేసినా కేసు నుంచి తప్పించుకోలేరని, చేసిన తప్పుకు శిక్ష అనుభవించి తీరాల్సిందేనని, అది నీడ ఎల్లప్పుడు వెంటాడుతూనే ఉంటుందని పేర్కొన్నారు.

అమృత్ 2.0 టెండర్లలో అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికే టెండర్లు ఖరారు అయ్యాయని స్పష్టం చేశారు. అమృత్ 2.0 పనులకు రీటెండర్ పిలిచేలా చేసిందే కేటీఆర్ అని మండిపడ్డారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడితే ప్రజల్లో ఉన్న పరువు పోవడం ఖాయమని వెలిచాల రాజేందర్ రావు పలికారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.



# .. ప్రజల ఆస్తిపాస్తులపై కన్నేశారు

(మొదటి పేజీ తరువాయి)

'తెలంగాణలో 15 పర్సంట్ కమీషన్ పాలన నడుస్తోంది. రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఒక్కటీ కూడా అమలు చేయలేదు.ఇప్పుడుకోట్ల యాడ్స్ ఇచ్చి మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాలనుకుంటున్నారు. తెలంగాణ పైసలన్నీ మహారాష్ట్రలో ఖర్చు చేస్తున్నారు. ముస్లిం రిజర్వేషన్లను సుప్రీంకోర్టే కొట్టేసింది. అయినా మైనారిటీ రిజర్వేషన్ల పేరుతో మోసం చేసే కుట్ర జరుగుతోంది. ఇక కుల గణన పేరుతో ప్రజల ఆస్తిపాస్తులపై కన్నేశారు. ఛత్రపతి శివాజీ వారసులారా. మొగల్స్ కోటను బద్దలు కొట్టిన చరిత్ర మీది. కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టండి' అని మహారాష్ట్ర ఓటర్లకు పిలుపునిచ్చారు బండి సంజయ్.

కాగా నాగ్ పూర్ పట్టణంలో గల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సంస్థ కేంద్ర కార్యాలయాన్ని బండి సంజయ్ సందర్శించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వచ్చిన ఆయన అక్కడి నిర్వాహకులతో చాలా సేపు మాట్లాడారు.



# నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆహారం అందించాలనే తనిఖీలు

## మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్**

నగర ప్రజలకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహార పదార్థాలు అందించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు.బుధవారం సాయంత్రం మేయర్ లక్డికాపూల్ లోని మొఘల్ రెస్టారెంట్,మాసబ్ ట్యాంక్ లోని డైన్ హిల్ హోటల్ ను మేయర్ అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... హోటళ్ల కిచెన్‌లో పరిశుభ్రత పాటించడం లేదని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే హోటల్ యజమానులు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని కోరారు. .మేయర్ వెంట హెల్త్ అడిషనల్ కమీషనర్ పంకజ, చీఫ్ వెటర్నరీ, చీఫ్ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అబ్దుల్ వకీలు, డాక్టర్ పద్మజ, ఇంచార్జి ఫుడ్ సెక్యూరిటీ అసిస్టెంట్ కంట్రోల్ ముత్యం రాజు ఫుడ్ సెక్రటరీ అధికారి లక్ష్మి కాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పేదయువతి పెళ్లికి చేయూత

## టేకు మంచాలు అందించిన బెంద్రం తిరుపతి రెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి,ఇల్లంతకుంట**

ఇల్లంతకుంటమండలంలోని రేపాక గ్రామంలో పేద కుటుంబం పండుగు.లక్ష్మన్ ముదిరాజ్ - పద్మ దంపతుల కూతురు భార్గవి - నవీన్ ముదిరాజ్ వివాహనికి బెంద్రం తిరుపతి రెడ్డి చేయుతా అందించారు. బెంద్రం తిరుపతి రెడ్డి ఫౌండేషన్ ద్వారా నిరుపేద యువతికి టేకు మంచాలు అందించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి

మాట్లాడుతు.. ఇల్లంతకుంట మండలంలోని పేద కుటుంబల పిల్లల వివాహలకి ఎల్లపుడు సహాయాలు చేస్థానాన్ని,అన్ని గ్రామాలలోనీ, సేవ ప్రతినిధులు, యువకులు సమాచార మందించాలని తిరుపతి రెడ్డి అన్నారు. ఈ సహాయ సేవా శుభ కార్యక్రమంలో ఫౌండేషన్ సేవ ప్రతినిదులు దండవేణి రజినీకాంత్ , బొల్లం రాంసాగర్ , రొండ్ల రాజిరెడ్డి , గజ్జల శ్రీనివాస్ , అంతగిరి అనిల్ , ఉత్కం సంతు , తడకపెల్లి రాకేష్ , రాచకొండ. అజయ్ , లక్ష్మన్ , మహేష్ , రాములు , శ్రీనివాస్ నూతన వధువను ఆశీర్వదించారు.

# అందుకే కులగణన చేపట్టాం..

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా కూడా ఓబీసీ గణాంకాలు తేలాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆ ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమలు జరగాలన్నారు. జనాభా లెక్కల సందర్భంగానే కేంద్రమే ముందుకొచ్చి ఓబీసీ గణాంకాలను కూడా సేకరించాలని సూచిం చారు. ఓబీసీ గణాంకాలు సేకరించడంలో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరమేంటని ప్రశ్నిం చారు. నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలంటే ఆ ప్రక్రియకు ప్రాతిపదిక ఏంటన్నది ముం దు నిర్ధేశించాలన్నారు. దానిపై కూడా చర్చ జరగాలన్నారు. ప్రాతిపదిక నిర్ణయించిన తర్వాత ప్రక్రియ చేపట్టాలన్నారు. లేదంటే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవడమే కాకుండా ఉత్తరాది, దక్షిణాది అన్న వాదన తెరమీదకు వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను విస్మరిస్తున్నారని కేంద్రంపై రేవంత్ మండిపడ్డారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చేవారిని గుజరాత్‌కు మళ్లిస్తున్నారని ఆరోపించారు. సెమీకండక్టర్ పరిశ్రమ అందుకు ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. గుజరాత్‌కు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని చెప్పారు. కానీ ప్రధానమంత్రి గుజరాత్‌కు మాత్రమే కాదని.. దేశ ప్రధానమంత్రి ఒక జడ్జిలా ఉండాలని ఎద్దేవా చేశారు. ఆటలో రిఫరీ ఒక జట్టు తరఫున ఆడకూడదని.. ఒకరి తరఫున వకాల్తా పుచ్చుకోవద్దని చెప్పారు.ఇలాంటి పరిణామాలు దేశానికి మంచిది కాదని సీఎం రేవంత్ హితవు పలికారు.

# ..ఆర్టికల్ 370 పునరుద్ధరించబోం

(మొదటి పేజీ తరువాయి)

ర్యాలీలో మాట్లాడుతూ.. పదేళ్ల సోనియా గాంధీ-మన్మోహన్ సింగ్ పాలనలో ఉగ్రవాదులు సులభంగా జమ్ముకశ్మీర్‌లో ప్రవేశించి బాంబు దాడులకు పాల్పడ్డారని విమర్శలు గుప్పించారు. శ్రీనగర్‌లోని లాల్ చౌక్‌ను సందర్శించిన సందర్భంగా తాను భయపడ్డానని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుశీల్‌కుమార్ షిండే చేసిన వ్యాఖ్యలపై షా స్పందిస్తూ.. షిండే జీ, మీ మనవళ్లతో కలిసి ఇప్పుడు కాశ్మీర్‌కు వెళ్లండి, మీకు ఎటువంటి హాని జరగదు' అని అన్నారు.కాగా జమ్ముకశ్మీర్‌లో ఇటీవల ఏర్పడిన ఓమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ఎన్సీ ప్రభుత్వం.. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ను పునరుద్ధరించాలని అసెంబ్లీలో తీర్మాణాన్ని ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే.కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలో జరిగిన మరో ర్యాలీలో కేంద్రమంత్రి ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. రాహుల్ గాంధీ నాల్గో తరం కూడా కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని పునరుద్ధరించలేరని అన్నారు. దేశ భద్రత కోసం ప్రధాని మోదీ చాలా కృషి చేశారని షా అన్నారు.

# .. కాళోజీకి అందించే ఘన నివాళి

(మొదటి పేజీ తరువాయి)

కవిగా తన కలాన్ని గళాన్ని మొత్తంగా తన జీవితాన్ని తెలంగాణ కోసం అర్పించిన కాళోజీ కృషి చిరస్మరణీయమని కొనియాడారు.

తెలంగాణ సమాజం కోసం కాళోజీ పడిన తపన, వారందించిన పోరాట స్ఫూర్తి, మలిదశ ఉద్యమంలో అనంతర బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఇమిడివున్నదని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. కాళోజీ కృషి ని, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించడానికి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. తోటి మనిషి క్షేమాన్ని కోరుకోవడం, సబ్బండ వర్గాల అభ్యున్నతకి చిత్తశుద్ధితో కృషి చేయడం ద్వారానే వ్యక్తులుగా, ప్రభుత్వాలుగా కాళోజీ కి మనం అందించే ఘన నివాళి అని కేసీఆర్ అన్నారు.

ప్రజా గొంతుక.. ధిక్కార ప్రతీక కాళోజీ అని కేటీఆర్ అన్నారు. అక్షరాన్ని ఆయుధంగా మలిచి, మాటల తూటాలతో ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని ధారబోసిన యోధుడు మన కాళన్న అని కేటీఆర్ అన్నారు . కవిగా, రచయితగా సమాజంలోని అన్యాయాలకు, అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు పరితపించిన అక్షర తపస్వి కాళోజీ నారాయణ రావు అని కొనియాడారు.తెలంగాణ భాష బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష అని ఎలుగెత్తి చాటిన మహనీయుడు కాళోజీ జయంతిని (సెప్టెంబర్ 9) కేసీఆర్ గారు తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించారని గుర్తుచేశారు.. వైద్య విశ్వవిద్యాలయానికి వారి పేరు పెట్టారని అన్నారు. వరంగల్‌లో సుందరమైన కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించారని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, తెలంగాణ ఉద్యమకారునిగా కాళోజీ అందించిన స్ఫూర్తి, చేసిన సేవలు సదా స్మరణీయమని అన్నారు.

# కలెక్టర్‌పై దాడి చేయిస్తే వెనక్కి తగ్గుతాం అనుకుంటున్నారా?

## డిప్యూటీ సీఎం భట్టి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

వెనుకబడిన కొడంగల్‌ను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక అభివద్ధి సాధిస్తే తప్ప ప్రపంచంతో పోటీ పడలేమన్నారు. పరిశ్రమలు రావాలంటే భూ సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. పరిశ్రమలు పెద్ద ఎత్తున తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు."భూమి కోల్పోతున్న రైతుల



బాధ మాకు తెలుసు. రైతుల బాధను ఇందిరమ్మ ప్రభుత్వం అర్థం చేసుకుంది. భూమి కోల్పోతున్న వారికి మెరుగైన ప్యాకేజీతో పాటు పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తాం. ఇళ్లు కోల్పోతున్న వారికి మంచి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇస్తున్నాం. కావాలనే కుట్రపూరితంగా కలెక్టర్‌పై భారాస శ్రేణులు దాడి చేశాయి. అమాయక గిరిజనులను రెచ్చగొట్టి దాడికి ఉసిగొల్పారు. కలెక్టర్, అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడి సమస్యకు పరిష్కారం కాదు.. కలెక్టర్‌తో చర్చించి పరిష్కరించుకోవాలి.ఇందిరమ్మ రాజ్యంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. రాష్ట్రంలో పరిశ్రమలు రావడం భారాసకు ఇష్టం లేదా?ఇది బాధ్యత కలిగిన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదు. ప్రాజెక్టుల కోసం మీరు చాలా భూసేకరణ చేశారు.. ఏనాడూ మేం కాదనలేదు. కలెక్టర్‌పై దాడి చేయిస్తే వెనక్కి తగ్గుతాం అనుకుంటున్నారా? అభివృద్ధే మా లక్ష్యం. అధికారులపై దాడి చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయి. మీ కోసం అమాయక ప్రజలు నష్టపోవాలా? ఉద్యమ సమయంలో కూడా ప్రజలను రెచ్చగొట్టి ప్రాణాలు కోల్పోయేలా చేశారు" అని భట్టి విక్రమార్క విమర్శించారు.






# రాష్ట్రవ్యాప్తంగా 1401 కేంద్రాల్లో గ్రూప్-3 పరీక్షలు

- 5.36 లక్షల మంది అభ్యర్థులు హాజరు
- వరి..పత్తి కొనుగోళ్ల పురోగతిపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలులతో సీఎస్ సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-3 పరీక్షల ఏర్పాట్లు, వరి,పత్తి కొనుగోళ్ల పురోగతి, కొత్త నర్సింగ్పా,రామెడికల్ కాలేజీల ప్రారంభం, కొనసాగుతున్న సామాజిక ఆర్థిక సర్వే వంటి ప్రధాన అంశాల పై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు/సీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 1401 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 5.36 లక్షల మంది విద్యార్థులు గ్రూప్-3 పరీక్షలకు హాజరవుతున్నారని సీఎస్ తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు టీజీపీఎస్సీ ద్వారా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. గ్రూప్-1 పరీక్షల మాదిరిగానే గ్రూప్-3 పరీక్షలను కూడా సజావుగా, సక్రమంగా నిర్వహించేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలు స్వయంగా పర్యవేక్షించి అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు ఉండేలా చూడాలని, ఫూల్ ప్రూఫ్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు.

టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి పరీక్షల నిర్వహణకు కమిషన్ చేసిన ఏర్పాట్లను సంక్షిప్తంగా వివరించారు. పరీక్షలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు కలెక్టర్లకు అవసరమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రస్తావిస్తూ, జిల్లా కలెక్టర్లు వరి ధాన్యం రాకను ప్రతిరోజూ నిశితంగా పరిశీలించాలని వరి దిగుబడి కి అనుగుణంగా కొనుగోళ్లు జరిగేలా జాగ్రత్త వహించాలని కోరారు. ఈ సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా వరి దిగుబడి వస్తున్నందున క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని, గోదాములకు ధాన్యం రవాణా చేయాలని, త్వరగా చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్లను కోరారు. ప్రత్యేక అధికారులు తమ నిర్దేశిత జిల్లాల్లో వరి తరలింపును పర్యవేక్షించాలని, సిబ్బందికి అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా సమస్యలను పరిష్కరించి రైతుల్లో విశ్వాసాన్ని నింపాలని అధికారులందరూ తప్పనిసరిగా ప్రతిరోజూ కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆమె ఆదేశించారు.

కొత్తగా మంజూరైన నర్సింగ్/పారామెడికల్ కాలేజీలకు సంబంధించి మిగిలిపోయిన మరమ్మత్తు పనులను కూడా గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. సామాజిక ఆర్థిక కులాల సర్వే సజావుగా జరిగినందుకు కలెక్టర్లను ఆమె అభినందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి...
అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి...
అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడని ప్రకటించిన ప్రజా కవి కాళోజి నారాయణరావు నిత్య స్మరణీయుడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు.. కాళోజి నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కాళోజి నారాయణరావు చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.



పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి బుధవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ని రామ్ నగర్ లోని వారి నివాసంలో కలిశారు. నవంబర్ 15న కార్తీక పౌర్ణమి పండుగను పురస్కరించుకుని పాలకుర్తి సోమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవ వేడుకలకు రావాలని మంత్రి సురేఖను కోరారు. అనంతరం పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాల పై ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మంత్రి సురేఖతో చర్చించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు.



## కేటీఆర్ నరేందర్ రెడ్డి నివాసానికి..

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుతో కలిసి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు కొండంత అండగా ఉంటామని భరోసానిచ్చారు.నగరంలోని కేబీఆర్ పార్కులో బుధవారం ఉదయం వాకింగ్ చేస్తున్న నరేందర్ రెడ్డిని మఫ్టీలో పోలీసులు బలవంతంగా తమ వెంట తీసుకువెళ్లిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ ఫిలిం నగర్ రోడ్డు నంబర్ 7లో ఉన్న నరేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన తల్లి రుక్కమ్మ, సతీమణి శృతి, కుటుంబ సభ్యులను కలిశారు.నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కేటీఆర్ మాట్లాడుతూ,పోలీసులు నరేందర్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి బలవంతంగా తీసుకెళ్లిన దృష్ట్యా భయపడొద్దని, ఆందోళన చెందవద్దని పార్టీ కొండంత అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు.అటు తర్వాత నరేందర్ రెడ్డి నివాసం వద్ద గుమిగూడిన మీడియా ప్రతినిధులతో కేటీఆర్ మాట్లాడారు.ఈ సందర్భంగా కేటీఆర్ వెంట ఎంపీ రవిచంద్ర,మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, మహమూద్ అలీ, జగదీష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు తదితరులు ఉన్నారు.

## అధికారులపై దాడి, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం

### ఒక్కసారి కేసు నమోదైతే జీవితం అంధకారమే

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

నిరసనలు, ఆందోళనలు శాంతియుతంగా సాగితే ఎలాంటి సమస్య లేదు. కానీ ఏ మాత్రం హద్దులు మీరినా... ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన, అధికారులపై చేయి చేసుకున్నా.. భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశం ఉంది. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం లగచర్ల గ్రామంలో అధికారులపై దాడి ఘటన తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది.

ఏకంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పై చేయి చేసుకోవడం, ఇతర అధికారులపై కర్రలు, రాళ్లతో దాడులు చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో ఆందోళనలు, ధర్నాల్లో హద్దుమీరి ప్రవర్తించినా.. అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, వారిపై భౌతిక దాడులకు పాల్పడితే ఎదురయ్యే పరిణామాలు చాలా కఠినంగా ఉంటాయి. ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు హద్దు మీరితే ప్రధానంగా జరిగేది ప్రభుత్వ ఆస్తులు లేదా వాహనాలు ధ్వంసం అయ్యే అవకాశం ఉంటుంది. దీంతో పాటు అధికారుల పట్ల దురుసు ప్రవర్తన, వారి విధులను అడ్డుకోవడం, భయభ్రాంతులకు గురిచేయడం, హత్యాయత్నం వంటివి చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఇలాంటి వ్యవహారాల్లో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ.. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడటం లేదు. ప్రభుత్వ అధికారుల విధులను అడ్డుకొని ఆటంకం కలిగించడం బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 132 కింద నేరంగా పరిగణిస్తారు. ఆస్తుల విధ్వంసం, వాహనాలు ధ్వంసం చేయడం చేస్తే పీడీపీ చట్టం సెక్షన్ 3,4 కింద కేసులు నమోదు చేస్తారు. అధికారులను, సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం, గాయపర్చడం చేస్తే బీఎన్ఎస్ చట్టం 118,180 సెక్షన్ల కింద కేస్ ఫైల్ చేస్తారు. ఇక హత్యాయత్నం వంటి కేసులు బీఎన్ఎస్ సెక్షన్ 109 కింద కేసు నమోదు చేస్తారు. ఇవే కాకుండా ఘటన తీవ్రతను బట్టి వివిధ సెక్షన్లు ఉపయోగిస్తారు పోలీసులు.

## డిప్యూటీ స్పీకర్ పదవికి రఘురామ కృష్ణంరాజు పేరు ఖరారు

ఎన్డీఏ కూటమి తరపున నామినేషన్ దాఖలు.. నేడు ఉప సభాపతిగా రఘురామ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించే అవకాశం

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి పదవికి ఉండి శాసన సభ్యులు కనుమూరు రఘురామ కృష్ణంరాజు పేరును ప్రతిపాదిస్తూ బుధవారం మూడు నామినేషన్ దాఖలు అయ్యాయి. ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ఉప సభాపతి పదవికి ఆర్ఆర్ఆర్ ఖరారు కావడంతో ఎన్డీఏ కూటమి మూడు పార్టీలకు చెందిన మంత్రుల నేతృత్వంలో శాసన సభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ కు ఆయన తరపున నామినేషన్ పత్రాలను అందజేశారు. శాసన సభ్యులు కనుమూరు రఘురామ కృష్ణంరాజు పేరుని ప్రతిపాదిస్తూ ఎన్డీఏ కూటమిలోని మూడు పార్టీల తరుపున మూడు నామినేషన్లను దాఖలు చేశారు. టి.డి.పి. తరపున రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, జనసేన తరపున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, బి.జె.పి. తరపున పెన్మత్స విష్ణుకుమార్ రాజు వేరు వేరుగా



సంతకాలు చేసి ఉప సభాపతి పదవికి ఉండి శాసన సభ్యులు కనుమూరు రఘురామ కృష్ణంరాజు పేరును ప్రతిపాదిస్తూ మూడు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. రఘురామ కృష్ణంరాజు నామినేషన్ల దాఖల చేయడానికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంన్నాయుడు హాజరయ్యారు.



## డైరెక్టర్ వర్మ కు నోటీసులు

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్

డైరెక్టర్ రాంగోపాల్‌వర్మకు ఒంగోలు మద్దిపాడు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను కించపరిచేవిధంగా రాంగోపాల్‌వర్మ పోస్టింగ్స్ పెట్టాడంటూ మద్దిపాటు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు మార్ఫింగ్ చేసిన ఫోటోలు ఎక్స్‌లో పోస్టు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ మేరకు విచారణకు హాజరుకావాలని పోలీసులు ఆయనకు బుధవారం నోటీసులు ఇచ్చారు.

## ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

### సి.ఎస్ శాంతి కుమారి

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్



ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎల్.బీ స్టేడియంలో నిర్వహించే విద్యా శాఖ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు.
పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్.బీ. స్టేడియంలో గురువారం మధ్యాహ్నం నిర్వహించే కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, నగర పోలీస్ కమీషనర్ సి.వీ ఆనంద్, ఫైర్ సర్వీసుల శాఖ డీజీ నాగిరెడ్డి, జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హరీష్ , హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ వెంకట నర్సింహా రెడ్డి తదితర ఉన్నతాధికారులు ఈ టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. దాదాపు 14 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనే ఈ సమావేశంలో ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సి.ఎస్ అన్నారు. ప్రాధానంగా వివిధ జిల్లాల నుండి వచ్చే వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బదులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన చేపట్టాలని, భద్రతకు ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ఇప్పటి వరకు 4,44,275 ఇళ్ల సర్వే పూర్తి




ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఆధ్వర్యంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ సర్వే కోసం నియమించిన ఇన్యుమరేటర్లు ప్రతిరోజూ ఒక్కో ఈబీ బ్లాక్‌లో సుమారు 8 నుండి 10 ఇళ్లను సందర్శిస్తున్నారు. ఈ సర్వే సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ మరియు కుల అంశాలు సర్వే నిర్వహిస్తున్నారు. అధికారులు సర్వేలో సంఖ్య కంటే నాణ్యతపై ఎక్కువగా దృష్టి సారించాలని సూచించారు. కొన్ని సర్కిల్స్‌లో ఇన్యుమరేటర్లు రోజుకు 10 నుండి 15 ఇళ్లను సర్వే చేస్తుండగా, మరికొన్ని సర్కిల్స్‌లో 8 నుండి 10 ఇళ్లను మాత్రమే సర్వే చేస్తున్నారు. ఈ పరిస్థితిలో, నాణ్యతను ప్రాధాన్యంగా పెట్టి సర్వే ను కొనసాగించాలన్నారు.కుటుంబ సర్వే పూర్తి చేసిన ఫారాలను సూపర్వైజర్ అధికారులు పరిశీలించాలన్నారు.సర్వేలో తప్పులు లేకుండా, సమర్థవంతంగా నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక మానిటరింగ్ అధికారులను నియమించింది. ఈ సర్వే పర్యవేక్షణలో హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ కె. శ్రీవాత్సవ, వాటర్ వర్క్స్ జాయింట్ ఎం.డి. మాయంక్ మిట్టల్, ఎం.ఏ.యు.డి డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక కర్ణన్, కోఆర్డినేటర్ అధికారి హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫ్ రాజ్ అహ్మద్ ఉన్నారు. జీహెచ్ఎంసీ సీనియర్ అధికారులను నియమిస్తూ మూడు సర్కిల్స్‌కు ఒకర్ని నోడల్ అధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో బుధవారం 1,45,901 ఇళ్లను సర్వే చేయగా, ఇప్పటి వరకు మొత్తం 4,44,275 ఇళ్లను సర్వే చేశారు.

# వెయ్యి పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ మిడ్‌క్యాప్

దేశీయ ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు వరుసగా ఐదవ రోజు నష్టాలను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 688.17 పాయింట్లు పతనమై 77,987.01 వద్ద, నిఫ్టీ 235.65 పాయింట్లు కోల్పోయి 23,647.80 వద్ద ట్రేడ్ అయ్యాయి. ఆ విశేషాలేంటో ఇక్కడ చుద్దాం.

## 6 లక్షల కోట్లు కోల్పోయిన మదుపర్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న బలహీనమైన ధోరణుల నేపథ్యంలో సూచీలు మొత్తం దిగువకు పయనిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటలకు బీఎస్ఈ సెన్సెక్స్ 511.06 పాయింట్లు క్షీణించి 78,164.12 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు తగ్గిపోయి 23,696 స్థాయిలో ట్రేడయ్యాయి. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 453 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ 1030 పాయింట్లు తగ్గింది. ఈ నేపథ్యంలో బీఎస్ఈ సెన్సెక్స్‌లోని 30 స్టాక్స్‌లో 16 షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. మరోవైపు నిఫ్టీ 50లో 50 షేర్లలో 31 షేర్లు నష్టాల్లోనే ఉన్నాయి. దీంతో మదుపర్లు కొన్ని గంటల్లోనే 6 లక్షల కోట్ల రూపాయలు నష్టపోయారు.

### నష్టాల్లో ఉన్న వాటిలో

మహీంద్రా అండ్ మహీంద్రా (2.48 శాతం క్షీణత), మారుతీ సుజుకీ ఇండియా, టాటా స్టీల్, నెస్లే ఇండియా, సన్ ఫార్మా నష్టాలలో ముందుండగా, లాభాల్లో ఉన్న వాటిలో ఎన్‌టీపీసీ (1.28 శాతం), ఏషియన్ పెయింట్, టాటా మోటార్స్, భారతీ ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఉన్నాయి. ఇక సెక్టార్ల వారీగా చూస్తే హెల్త్‌కేర్, ఫార్మా, ఆటో సూచీలు 0.75, 0.85 శాతం మధ్య పడిపోగా, బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటి సూచీలు మాత్రమే లాభపడ్డాయి. ఇదే సమయంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.38 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 0.66 శాతం క్షీణించాయి.

### నష్టాలకు కారణమిదేనా..

అక్టోబరులో 6.2%గా నమోదైన దేశీయ ద్రవ్యోల్బణం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటం ఈ బేరిష్ సెంటిమెంట్‌కు కారణమని చెప్పవచ్చు. ఇది %=దీ×% ప్రాధాన్యత పరిధి కంటే ఎక్కువగా ఉంది. దీంతో స్టాక్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కనిపించిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇదే సమయంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 3,000 కోట్లకు పైగా విలువైన ఈక్విటీలను ఆఫ్‌లోడ్ చేశారు. ఇక %ఖూ% ద్రవ్యోల్బణం డేటా కంటే ముందు ట్రేడింగ్ జాగ్రత్తగా ఉండటంతో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇదే సమయంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర %వి%72.09 వద్ద ట్రేడవుతోంది.

### గత సెషన్ ఎలా..

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం తర్వాత మంగళవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో వాల్ స్ట్రీట్‌లో నష్టాలు కనిపించాయి. మంగళవారం బెంచ్‌మార్క్ నిఫ్టీ 50 దాదాపు ఐదు నెలల కనిష్ట స్థాయికి పడిపోయింది. ఎందుకంటే విదేశీ ఫండ్స్‌లో స్థిరమైన అమ్మకాలు, ఇండెక్స్ హెవీవెయిట్‌లలో తీవ్రమైన నష్టాలు మార్కెట్ పనితీరుపై ప్రభావం చూపాయి. ఆదాయ అంచనాలు, పెట్టుబడి అవకాశాలు కూడా పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను అణచివేశాయి.



## 2047 నాటికి ఇంధన డిమాండ్ రెట్టింపు

దేశ ఇంధన డిమాండ్ 2047 నాటికి రెట్టింపు అవుతుందని పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ అన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్తంగా దేశీయ డిమాండ్ 25 శాతం పెరుగుతుందన్నారు. సెంటర్ ఫర్ హై టెక్నాలజీ (సీహెచ్‌టీ), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) సంయుక్తంగా బెంగళూరులో నిర్వహించిన ఎనర్జీ టెక్నాలజీ మీట్ (ఈటీఎం)2024ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. 'ఎనర్జీ సెక్యూరిటీ, సుస్థిరత, సాంకేతిక ఆవిష్కరణలకు ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలిచింది. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) గణాంకాల ప్రకారం 2047 నాటికి భారత ఇంధన డిమాండ్ రెట్టింపు అవుతుంది. రాబోయే రెండు దశాబ్దాలలో ప్రపంచవ్యాప్తంగా దేశీయ ఇంధన డిమాండ్ గణనీయంగా 25 శాతం పెరుగుతుంది. నికర-సున్నా ఉద్గారాల లక్ష్యాలను సాధించడంలో చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) మెరుగైన విధానాలు పాటించాలి. ఇథనాల్, హైడ్రోజన్, జీవ ఇంధనాలలో పురోగతి ద్వారా వికసిత్ భారత్ సాధనలో భాగం కావాలి. ఫాజిల్ ఫ్యూయెల్‌లో కలిపే జీవ ఇంధనం మిశ్రమం రేటు ప్రస్తుతం 16.9%కి చేరుకుంది. 2030 నాటికి ఇది 20% లక్ష్యాన్ని చేరాలనే లక్ష్యం ఉంది. కానీ షెడ్యూల్ కంటే ఐదేళ్ల ముందే ఈ లక్ష్యాన్ని అధిగమించే దిశగా ముందుకు సాగుతున్నాం' అని మంత్రి అన్నారు.

'భారతదేశం 250 రూపాల్లోని ముడి చమురును ప్రాసెస్ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. దేశీయ ప్రస్తుత ముడి చమురు శుద్ధి సామర్థ్యం 258 మిలియన్ మెట్రిక్‌టన్స్ పర్ యానమ్(ఎంఎంటీపీఏ)గా ఉంది. రానున్న రోజుల్లో ఇది 310 ఎంఎంటీపీఏకి పెరుగుతుందని అంచనా' అన్నారు. డిజిటల్ ఇన్నోవేషన్‌పై స్పందిస్తూ 2027 నాటికి దేశీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మార్కెట్ 70 బిలియన్ డాలర్ల(రూ.5.81 లక్షల కోట్లు)కు చేరుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ అండ్ డైరెక్టర్ (మార్కెటింగ్) వి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## ఒక్కో స్విగ్గీ ఉద్యోగికి కోటి రూపాయలు




ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ అనుకున్నంత పని చేసింది. రాత్రికి రాత్రి ఆ కంపెనీ ఉద్యోగులను కోటీశ్వరులను చేసింది. స్విగ్గీ ఐపీఓ లిస్టింగ్ ఆ కంపెనీ ఉద్యోగులకు జాక్ పాట్ తగిలేలా చేసింది. ఒక్క రోజులోనే 500 మందిపై కనకవర్షం కురిపించింది. అందుకు స్విగ్గీ సంస్థ తీసుకున్న గొప్ప నిర్ణయమే కారణం. బెంగళూరుకు చెందిన ఈ సంస్థ ఎంప్లాయిస్ స్టాక్ ఆప్షన్ ప్లాన్ కారణంగా 5వేల మంది ఉద్యోగులు కోట్లకు పడగలెత్తారు.

అందులో 500 మందికి ఒక్కో ఉద్యోగి కోటి చొప్పున అందుకోనున్నారు. ప్రస్తుతం కంపెనీ విలువ 12 బిలియన్లకు దగ్గరగా ఉంది. మిగిలిన అర్హులైన సిబ్బందికి రూ. 9వ వేల కోట్ల ఈఎస్ఓపీ పూల్ లో కొంత భాగాన్ని పంచుతారని తెలుస్తోంది. దీని ద్వారా అనేక సంవత్సరాలు కంపెనీలో పనిచేసిన వారితో పాటు ఇప్పుడు పనిచేస్తున్న ఉద్యోగులు కూడా ప్రయోజనం పొందనున్నారు.కంపెనీ విజయాన్ని క్యాష్ చేసుకోవడానికి స్విగ్గీ తమ ఉద్యోగులకు ఐపీఓ ద్వారా అరుదైన అవకాశాన్ని అందించింది. దీంతో వేల మంది ఉద్యోగుల కోటీశ్వరుల క్లబ్ లో చేరారు. తొలి రోజు ఈ కంపెనీ సబ్ స్క్రిప్షన్లు నిరాశ పరిచినప్పటికీ.. చివరి రోజు భారీగా కొనుగోలు చేయడంతో 3.59 రెట్లు సబ్ స్క్రిప్షన్ వచ్చింది.

## నెలకు రూ. 5 వేలు సేవ్ చేస్తే..

మీరు చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాటు చేసుకుంటే దీర్ఘకాలంలో మంచి రాబడులను పొందవచ్చు. అందుకోసం నెలకు రూ. 5 వేలు సేవ్ చేసినా, మీరు కొన్నేళ్లలోనే రూ. 2 కోట్ల మొత్తాన్ని పొందవచ్చు. అయితే ఇందుకోసం ఎన్నేళ్లు పడుతుంది. ఎంత మొత్తంలో పెట్టుబడులు చేయాలనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. దీనికోసం మీకు (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) పెట్టుబడులు అద్భుతమైన ఎంపిక. క్రమం తప్పకుండా క్రమశిక్షణతో పెట్టుబడులు చేస్తే అధిక మొత్తాన్ని దక్కించుకుంటారు. మీరు సమ్మేళనం ద్వారా మీ సంపదను క్రమంగా పెంచుకోవచ్చు.



అయితే మీరు రూ. 2 కోట్ల మొత్తాన్ని పొందాలంటే నెలకు ఎంత కట్టాలి, ఎన్నేళ్లు సేవ్ చేయాలనే విషయాలను ఇప్పుడు చుద్దాం. రూ. 5,000 నెలవారీ %బా×భా%తో ప్రారంభించి, ప్రతి సంవత్సరం 12 శాతం వార్షిక రాబడిని పొందుతారని భావిస్తే మీరు 32 ఏళ్లలో రూ. 2,25,46,485 మొత్తాన్ని పొందుతారు. దీనికోసం మీరు చేసే పెట్టుబడి రూ. 19,20,000 మాత్రమే. దీనికి అదనంగా మీరు చేసిన పెట్టుబడి కంటే వడ్డీనే రెండు కోట్ల రూపాయలకుపైగా రావడం విశేషం. ఒక వేళ మీరు 15 శాతం వార్షిక రాబడిని పొందితే ఈ మొత్తం నాలుగు కోట్ల రూపాయలు అవుతుంది. సిప్ అంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ . దీని ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి చేయవచ్చు. ఇందులో మీరు చిన్న, సులభమైన వాయిదాలలో పెట్టుబడి చేయవచ్చు. దీని కోసం మీరు నెలవారీ, త్రైమాసిక లేదా ఆరు నెలల ప్రాతిపదికన పెట్టుబడి ప్రణాళికలను ఎంచుకోవచ్చు. ద్వారా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడానికి పెద్ద మొత్తం అవసరం లేదు. ఇందులో మీరు కనీసం మొత్తం రూ. 100 లేదా రూ. 500 నుంచి కూడా పెట్టుబడులు చేసుకోవచ్చు.చాలా మంది నెలవారీ మోడ్‌ను ఎంచుకుంటారు. లేదంటే ఏకమొత్తంలో కూడా పెట్టుబడులు చేసుకోవచ్చు.లు అనుభవం లేని, మొదటిసారి పెట్టుబడిదారులకు మంచి ఎంపిక. ఎందుకంటే వీటిలో తక్కువ రిస్క్‌తో మంచి రాబడిని పొందే అవకాశాన్ని ఉంటుంది.


## త్వరలో పెరగనున్న ధరలు


దేశంలో సామాన్య ప్రజలకు బ్యాడ్ న్యూస్. ఎందుకంటే మరికొన్ని రోజుల్లో కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ద్రవ్యోల్బణం కారణంగా ఆహారం కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

దేశంలో ఈసారి వచ్చిన పెళ్లిళ్ల సీజన్‌లో కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పెళ్లిళ్లు చేసుకునే వారు వంటల కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని అంటున్నారు. ఇప్పటికే కిరాణా సామాగ్రి, ఆయిల్ ధరలు కూడా చాలా పెరిగాయి. ఎందుకంటే ఇటీవల వచ్చిన నివేదికలో రిటైల్ ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.49 శాతం నుంచి అక్టోబర్‌లో 14 నెలల గరిష్ట స్థాయి 6.21 శాతానికి పెరిగింది. పెరుగుతున్న కూరగాయల ధరల నేపథ్యంలో ఆహార ద్రవ్యోల్బణం గత నెలలో 9.2 శాతం నుంచి 10.87 శాతానికి చేరుకుంది.

**కారణమిదేనా..:** అయితే దీనికి ప్రధాన కారణం కూరగాయల ధరలు 42.18 శాతం పెరగడమేనని నిపుణులు అంటున్నారు. పచ్చికూరగాయల ధరలు గతం కంటే స్వల్పంగా తగ్గాయి. కానీ వెల్లుల్లి, బంగాళదుంప వంటి తదితర ధరలు మాత్రం నిలకడగా ఉన్నాయి. ఇవి మరికొన్ని రోజుల్లో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇదే సమయంలో డ్రైఫ్రూట్స్ ధరలు కూడా పెరగడం విశేషం. ఇక బంగారం ధరల విషయానికి వస్తే పెళ్లిళ్ల సీజన్ ఉన్న నేపథ్యంలో అనేక మంది ముందే బుక్ చేసుకున్నారు. ఈ క్రమంలో వీటి ధరలు గతంలో కంటే తగ్గే ఛాన్స్ ఉందని చెబుతున్నారు.

**బంగారం, వెండి ఇలా..:** దీపావళి నాటికి కిలో వెండి ధర రూ. 99 వేలకు చేరుకోగా, 10 గ్రాముల బంగారం ధర రూ. 82-83 వేలకు చేరుకుంది. ప్రస్తుతం వెండి ధర కిలో రూ. 90-91 వేలకు తగ్గగా, బంగారం ధర కూడా 10 గ్రాములు రూ.78 వేల స్థాయికి చేరుకుంది. అందువల్ల తగ్గిన రేట్ల ప్రయోజనం ముందుగా కొనుగోలు చేసిన వారికి లభించలేదని చెప్పవచ్చు. అయితే మరికొన్ని రోజుల్లో బంగారం ధరలు మాత్రం పెరిగే అవకాశం లేదని పలువురు చెబుతుండగా, మరికొంత మంది మాత్రం పెరుగుతాయని అంటున్నారు.





# కడప దర్గాకు రామ్‌చరణ్

**హీరో రామ్‌చరణ్ త్వరలో కడప దర్గా సందర్శించనున్నారు. అక్కడ నిర్వహించనున్న ఓ ఈవెంట్‌లో ఆయన పాల్గొంటారు. నటుడు రామ్‌చరణ్ కడప దర్గాను సందర్శించనున్నారు. దర్గాలో నిర్వహించనున్న 80వ నేషనల్ ముషాయరా గజల్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నెల 18న ఈ వేడుక జరగనుంది.**


ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్' పనులతో బిజీగా ఉన్నారు రామ్ చరణ్. శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఇటీవల రిలీజైన టీజర్ అభిమానుల్లో మరిన్ని అంచనాలు పెంచింది. కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, నవీన్ చంద్ర, అంజలి తదితరులు కీలక పాత్రలు పోషించారు. మరోవైపు కొత్త సినిమా 16 (వర్కింగ్ టైటిల్) కోసం సన్నద్ధమవుతున్నట్టు కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియా పోస్ట్ పెట్టారు చరణ్. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు తెరకెక్కించనున్న ఆ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్.

# అ దేశానికి చిరంజీవి.. ఎందుకంటే

**మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న హైలీ యాంటిసిపేటెడ్ క్రేజీ సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర' . ఈ మూవీ అనౌన్స్‌మెంట్‌తోనే ఎక్కడాలేని బజ్ సినిమాపై ఏర్పడింది. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్ తెగ ఆకట్టుకున్నాయి. సంక్రాంతి కానుకగా రిలీజ్ కావాల్సిన ఈ సినిమా 'గేమ్ ఛేంజర్' కోసం సమ్మర్ కి షిఫ్ట్ అయినా విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మెగాస్టార్ చిరంజీవి విదేశాలకి ప్రయాణమయ్యారు. ఏ దేశం? ఎందుకంటే..**

'విశ్వంభర' సినిమా సంక్రాంతి నుండి 'మే'కి షిఫ్ట్ అయినా విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మిగతా పనులని సినీ యూనిట్ నెమ్మదిగా ముందుకు తీసుకు వెళ్తోంది. ఇంకా ఈ సినిమాలో కొన్ని సన్నివేశాలతో పాటు ఒక సాంగ్ షూట్ చేయాల్సి ఉంది. దీనికోసం మూవీ టీమ్ జపాన్‌కి పయనమైంది. సో, చిరంజీవి ఒక పది రోజుల పాటు ఈ షూటింగ్ లో పాల్గొననున్నారు. మరోవైపు.. చిరంజీవి కోసం బీవీఎస్ రవి ఓ సామాజిక సందేశం నిండిన కథ రాశారట. 'ఠాగూర్' తరహా సినిమా అని, బలమైన సందేశంతో పాటు, కమర్షియల్ హంగులన్నీ ఉంటాయని తెలుస్తోంది. ఇదే విషయంపై బీవీఎస్ రవి కూడా ఓ స్టేట్‌మెంట్ ఇచ్చారు. "చిరంజీవి అంటే, పాటలు డాన్సులు గుర్తొస్తాయి. ఆ తరహా చిత్రాలు ఆయనే ఎన్నో చేశారు. అలాగే సందేశాత్మక చిత్రాలు చేశారు. వాటిని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ఓ పెద్ద స్టార్ బలమైన సందేశాన్ని ఇస్తే , చాలామందికి చేరువ అవుతుందని, తాను అలాంటి కథే సిద్ధం చేశానని చెప్పుకొచ్చారు బీవీఎస్ రవి. గతంలో కల్యాణ్ కృష్ణ కురసాల దర్శకత్వంలో ఓ సినిమా అనుకున్నారు. అది పట్టాలెక్కలేదు. అది కూడా క్యూలో ఉందా లేదా అనేది చూడాలి. హరీష్ శంకర్ కూడా ఒక సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నారు. 'విశ్వంభర' తరవాత ఏ సినిమా చేయాలన్న విషయంలో చిరంజీవి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. బీవీఎస్ రవి కథ కూడా లైన్ లో ఉందని, అయితే చిరు అంగీకారం తెలపాలని అంటున్నారు.



# తెలుగులో ప్రమోషన్స్ నిల్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వైర ఎంటర్‌టైన్ మెంట్స్, ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి హై బడ్జెట్ తో నిర్మించారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ మూవీ టీజర్, ట్రైలర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జివి ప్రకాష్ కుమార్ కంపోజ్ చేసిన మట్కా ఆల్బమ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'మట్కా' నవంబర్ 14న ప్రేక్షకులు ముందుకు రానుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్ దేశవ్యాప్తంగా బాగానే జరుగుతున్న తెలుగు రాష్ట్రాల్లో మాత్రం సరైన రెస్పాన్స్ కరువైంది. ఇంతకీ ఏమైందంటే..

పాన్ ఇండియా రిలీజ్ నేపథ్యంలో 'మట్కా' హీరో వరుణ్ తేజ్ ప్రస్తుతం ముంబైలో ప్రమోషన్స్ చేస్తూ బిజీగా ఉన్నాడు. మరోవైపు తెలుగులోనూ ఈ సినిమాకి తెలుగులోనూ భారీగా థియేటర్లు కేటాయించారు. కానీ.. ఈ సినిమాకి అడ్వాన్స్ బుకింగ్స్ పరంగా సరైన రెస్పాన్స్ కనిపించటం లేదు. వరుణ్ గత చిత్రాల ఎఫెక్ట్ ఈ సినిమాపై కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లో కూడా కేవలం 10% బుకింగ్స్ మాత్రమే జరిగాయి. ఆన్‌లైన్‌లో స్క్రీన్స్ అన్ని ఖాళీగా కనిపిస్తున్నాయి. కాగా వరుణ్ ఈ సినిమాలో నాలుగు షేడ్స్‌లో కనిపిస్తున్నాడు. మౌత్ టాక్ బాగుంటే ఈ సినిమా సూపర్ హిట్ అయ్యే ఛాన్సెస్ ఉన్నాయి.

'మట్కా' పీరియాడిక్ డ్రామాగా సిద్ధమైంది. వరుణ్ నాలుగు భిన్నమైన గెటప్పుల్లో కనువిందు చేయనున్నారు. రతన్ ఖత్రి అనే గ్యాంబ్లర్ స్టోరీని ఆధారంగా చేసుకొని ఫిక్షనల్ కథ సిద్ధం చేశామని దర్శకుడు చెప్పారు. "వాసు అనే వ్యక్తి ప్రయాణమే ఈ కథ. 1958లో చిన్నతనంలోనే శరణార్థిగా బర్మా నుంచి వైజాగ్‌కు వస్తాడు. అక్కడి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ 'మట్కా' కింగ్‌లా ఎలా మారాడనేది కథ".

# బాలయ్య సినిమాకి టైటిల్ ఫిక్స్



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ కొన్నేళ్లుగా అపజయమెరుగకుండా వరుస భారీ విజయాలతో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం తన 109వ చిత్రం %చీదీఖ%109 కోసం బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లితో చేతులు కలిపారు. ఈ సినిమాపై ఎటువంటి అంచనాలు ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. నందమూరి అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదుచూస్తున్న చిత్రమిది. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్ విశేషంగా ఆకట్టుకోగా.. తాజాగా మేకర్స్ మాసివ్ అప్డేట్‌ని వదిలారు. దీపావళికి ఇస్తామన్న ఈ అప్డేట్‌ని ఎప్పుడు ఇవ్వబోతోంది తెలుపుతూ.. మేకర్స్ ఓ పవర్ ఫుల్ పోస్టర్‌ని వదిలిన విషయం తెలిసిందే. అయితే అ అప్డేట్ ఇంకా అనౌన్స్ కాకముందే అందులోని విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది ఇంతకీ అదేంటంటే..

ఇటీవల మేకర్స్ కార్తీక పూర్ణిమ శుభ సందర్భంగా, నవంబర్ 15న ఉదయం 10 గంటల 24 నిమిషాలకు %చీదీఖ%109 టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ పోస్టర్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. అయితే ఈ సినిమాకు సర్కార్ సీతారామ్, డాకూ మహరాజ్, వీరమాస్ ఇలా అనేల టైటిల్స్ టీమ్ పరిశీలించారని తెలిసిందే. కాగా, ఫైనల్‌గా 'డాకూ మహరాజ్' అనే టైటిల్ పవర్ఫుల్‌గా, కొత్తగా బాగుంటుందని టీమ్ డిసైడ్ చేసిందని సమాచారం.


# ఫస్టాఫ్ అద్భుతం

బాక్సాఫీస్ వద్ద 'పుష్ప' రూల్‌కు సమయం దగ్గరవుతోంది. దాదాపు 21 రోజుల్లో 'పుష్ప ది రూల్' విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే 'పుష్ప 2' షూట్‌కు సంబంధించి నటి రష్మిక ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చారు. చిత్రీకరణ ఆద్యంతం చాలా సరదా జరిగిందని చెప్పిన ఆమె.. షూట్ చివరి దశకు చేరుకుందని తెలిపారు. డబ్బింగ్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. డబ్బింగ్ స్టూడియోలో దిగిన ఫొటోని షేర్ చేశారు.

"ఫన్, గేమ్స్ ఇక పూర్తయ్యాయి. పనిలో బిజీ అయ్యా..! 'పుష్ప ది రూల్' చిత్రీకరణ దాదాపు పూర్తి అయింది. ఫస్టాఫ్ డబ్బింగ్ పనులు కూడా పూర్తి చేశా. సెకండాఫ్ కోసం డబ్బింగ్ చెబుతున్నా. మై గాడ్.. ఫస్టాఫ్ అద్భుతంగా ఉంది. సెకండాఫ్ అంతకు మించి ఉంటుంది. మాటల్లో చెప్పలేకపోతున్నా. మీరు తప్పకుండా మైండ్ బ్లోయింగ్ అనుభూతిని పొందనున్నారు. ఈ చిత్రాన్ని మీకు చూపించేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా. షూట్ పూర్తి అవుతున్నందుకు బాధగా ఉంది" అని రష్మిక చెప్పారు.2021లో విడుదలైన 'పుష్ప ది రైజ్'కు కొనసాగింపుగా ఇది సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ - సుకుమార్ కాంబినేషన్‌లో ఇది తెరకెక్కుతోంది. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది. ఎర్ర చందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రానున్న ఈ సినిమాలో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, శ్రీవల్లిగా రష్మిక కనిపించనున్నారు. పార్ట్ 1లో ప్రేమికులుగా వీరిద్దరూ కనిపించారు. 'పుష్ప 2'లో భార్యాభర్తలుగా కనిపించనున్నారు. గత చిత్రంలో స్పెషల్ సాంగ్ కోసం సమంత కనిపించగా.. సీక్వెల్‌లో ఐటమ్ సాంగ్‌కు శ్రీలీల డ్యాన్స్ చేయనున్నారు. ఫైనల్ కట్ పూర్తైందని దాదాపు మూడు గంటల నిడివి ఉందని సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్‌లో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే టీమ్ ప్రకటించింది. ఇండియాలో 6,500.. ఓవర్సీస్‌లో 5,000 స్క్రీన్స్‌లో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు.



# నిస్వార్థమైన ప్రేమకు అర్థం



బాలీవుడ్‌లో షారుక్ ఖాన్, ప్రీతీ జింటా జంటకు ప్రత్యేక అభిమానులుంటారు. వీరిద్దరూ కలిసి నటించిన చిత్రం 'వీర్-జారా'. అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ సినిమాను ప్రీతీ తాజాగా గుర్తుచేసుకున్నారు. ఆ సినిమా నిస్వార్థమైన ప్రేమకు అర్థం తెలిపిందన్నారు . యశ్ చోప్రా దర్శకత్వం వహించిన 'వీర్-జారా' ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డును అందుకుంది. రొమాంటిక్ చిత్రంగా 2004లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా అప్పట్లో భారీ వసూళ్లను సాధించింది. ఇది విడుదలై 20 ఏళ్లు పూర్తయినట్లు తెలుపుతూ ప్రీతీజింటా పోస్ట్ పెట్టారు. "వీర్‌జారా'కు 20 ఏళ్లు. నాకు ఇప్పటికీ ఈ సినిమా నిన్న విడుదలైనట్లు అనిపిస్తోంది. ఈ చిత్రం నిస్వార్థమైన ప్రేమకు అసలైన అర్థాన్ని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న ఈ అందమైన ప్రేమకథలో భాగమైనందుకు నాకెంతో ఆనందంగా ఉంది. ఈ చిత్రం ఎప్పటికీ ప్రత్యేకమైనదే' అంటూ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌పై నెటిజన్లు స్పందిస్తున్నారు. ఈ సినిమాను మరోసారి రీ రిలీజ్ చేయాలని కోరుతున్నారు. షారుక్ , ప్రీతీజింటా ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, రాణి ముఖర్జీ, అనుపమ్ ఖేర్, హేమామాలినిలతో పాటు మరికొందరు అగ్ర నటీనటులు కనిపించారు.ఈ చిత్రం 2004లో ఉత్తమ ప్రజాదరణ పొందిన సినిమాగా జాతీయ పురస్కారాన్ని అందుకుంది.

# సౌతాఫ్రికాతో మూడో టీ20

## రమణ్‌దీప్ సింగ్ అరంగేట్రం, అభిషేక్‌కు మరో అవకాశం

సెంచూరియన్ వేదికగా టీమిండియాతో ఇవాళ (నవంబర్ 13) జరుగుతున్న మూడో టీ20లో సౌతాఫ్రికా టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ కోసం ఇరు జట్లు చెరో మార్పు చేశాయి. భారత్ తరఫున ఆవేశ్ ఖాన్ స్థానంలో రమణ్‌దీప్ సింగ్ ఎంట్రీ ఇచ్చాడు. రమణ్‌దీప్‌కు ఇది డెబ్యూ మ్యాచ్.

సౌతాఫ్రికా తరఫున న్కాబయోమ్జి పీటర్ స్థానంలో లూథో సిపమ్లా తుది జట్టులోకి వచ్చాడు. ఈ సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన అభిషేక్ శర్మకు మరో అవకాశం ఇచ్చింది టీమిండియా మేనేజ్‌మెంట్. కాగా, నాలుగు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో భారత్.. రెండో మ్యాచ్‌లో సౌతాఫ్రికా గెలుపొందిన విషయం తెలిసిందే.

**తుది జట్లు..**

భారత్ (ప్లేయింగ్): సంజు శాంసన్(వికెట్‌కీపర్), అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్ పటేల్, రమణదీప్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి

దక్షిణాఫ్రికా (ప్లేయింగ్: ర్యాన్ రికెల్టన్, రీజా హెండ్రిక్స్, ఎయిడెన్ మార్క్రమ్(కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, హెన్రిచ్ క్లాసెన్(వికెట్‌కీపర్), డేవిడ్ మిల్లర్, మార్కో జాన్సెన్, ఆండిల్ సైమ్‌లేన్, గెరాల్డ్ కోయెట్జీ, కేశవ్ మహరాజ్, లూథో సిపమ్లా






# సంజూ మరోసారి..!

టీమిండియా స్టార్ ఓపెనర్ సంజూ శాంసన్ ఎప్పుడు ఎలా ఆడతాడో ఎవరికి అంతుచిక్కడం లేదు. ఈ వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్ ఓ మ్యాచ్‌లో సెంచరీ చేస్తే.. మరుసటి మ్యాచ్‌లో డకౌటవుతున్నాడు. సౌతాఫ్రికా టూర్‌కు ముందు బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో సెంచరీ చేసిన సంజూ.. ఆతర్వాత సౌతాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో మరో సెంచరీతో మెరిశాడు. ఈ రెండు సెంచరీల అనంతరం సంజూ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌటయ్యాడు.

తాజాగా సౌతాఫ్రికాతో జరుగుతున్న మూడో టీ20లో సంజూ రెండు బంతులు ఎదుర్కొని ఖాతా తెరవకుండానే పెవిలియన్ బాట పట్టాడు. దీనికి ముందు మ్యాచ్‌లో కూడా సంజూ డకౌటయ్యాడు. వరుస సెంచరీలు చేసి మాంచి జోష్ మీద కనిపించిన సంజూ.. ఆతర్వాత వరుసగా రెండు డకౌట్లై ఓ చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సార్లు డకౌటైన భారత ప్లేయర్‌గా తన చెత్త రికార్డును మరింత మెరుగుపర్చుకున్నాడు.

సంజూ ఈ ఏడాది టీ20ల్లో ఐదోసారి డకౌటయ్యాడు. ఈ ఏడాది ఆరంభంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో డకౌటైన సంజూ.. ఆతర్వాత శ్రీలంకపై వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఖాతా తెరవకుండానే నిష్క్రమించాడు. తాజాగా సౌతాఫ్రికాపై వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌటయ్యాడు. సంజూకు ముందు ఓ క్యాలెండర్ ఇయర్‌లో (టీ20ల్లో) అత్యధిక సార్లు డకౌటైన చెత్త రికార్డు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, యూసఫ్ పఠాన్ పేరిట ఉండేది. ఈ ముగ్గురు ఓ క్యాలెండర్ ఇయర్‌లో మూడు సార్లు డకౌటయ్యారు.

మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేస్తున్న టీమిండియా ఖాతా తెరవకుండానే సంజూ శాంసన్ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన తిలక్ వర్మ మరో ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి స్కోర్ బోర్డును పరుగులు పెట్టిస్తున్నాడు. వీరిద్దరి ధాటికి భారత్ స్కోర్ 7 ఓవర్లలో 83/1గా ఉంది. అభిషేక్ 19 బంతుల్లో 42.. తిలక్ 22 బంతుల్లో 34 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. సంజూ వికెట్ మార్కో జన్సెన్‌కు దక్కింది. సంజూ రెండో టీ20లోనూ జన్సెన్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు.

### అశ్విన్ ఆల్‌టైమ్ రికార్డుపై కన్నేసిన

# మిస్టరీ స్పిన్నర్

టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి సహచర స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పేరిట ఉన్న ఓ ఆల్‌టైమ్ రికార్డుపై కన్నేశాడు. సౌతాఫ్రికాతో ఇవాళ (నవంబర్ 13) జరుగబోయే మూడో టీ20లో వరుణ్ మరో రెండు వికెట్లు తీస్తే.. టీమిండియా తరఫున ఓ ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్‌గా రికార్డు సృష్టిస్తాడు.




2016లో శ్రీలంకతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో అశ్విన్ 9 వికెట్లు తీశాడు. నాటి నుంచి ఓ ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో ఏ భారత స్పిన్నర్ ఇన్ని వికెట్లు తీయలేదు. ఇప్పుడు అశ్విన్ ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టే అవకాశం వరుణ్‌కు వచ్చింది. ప్రస్తుతం సౌతాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వరుణ్ ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో 5.25 సగటున 8 వికెట్లు తీశాడు.

డర్బన్ వేదికగా జరిగిన తొలి టీ20లో మూడు వికెట్లు తీసిన వరుణ్.. గెబెర్హా వేదికగా జరిగిన రెండో టీ20లో ఐదు వికెట్లు పడగొట్టాడు. సెంచూరియన్ వేదికగా ఇవాళ మూడో టీ20 జరుగనుంది. భారతకాలమానం ప్రకారం ఈ మ్యాచ్ రాత్రి 8:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా ఇరు జట్లు బరిలోకి దిగనున్నాయి. తొలి టీ20లో భారత్ గెలువగా.. రెండో టీ20లో సౌతాఫ్రికా గెలిచిన విషయం తెలిసిందే.

రెండో టీ20లో టీమిండియా తొలుత బ్యాటింగ్ చేసి 124 పరుగులకే పరిమితమైనా.. వరుణ్ చక్రవర్తి అద్భుతంగా బౌలింగ్ చేసి విజయావకాశాలు సృష్టించాడు. అయితే ఆఖర్లో కొయెట్జీ, స్టబ్స్ కొన్ని అద్భుతమైన షాట్లు ఆడి టీమిండియాకు గెలుపును దూరం చేశారు. ఈ మ్యాచ్‌లో వరుణ్ డేంజరెస్ బ్యాటర్లైన రీజా హెండ్రిక్స్, ఎయిడెన్ మార్క్రమ్, మార్కో జన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్ వికెట్లు పడగొట్టాడు.

# ఆంధ్రతో రంజీ మ్యాచ్..

## శతక్కొట్టిన హైదరాబాద్ ప్లేయర్

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ మధ్య రంజీ ట్రోఫీ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ అజేయ సెంచరీతో (124) చెలరేగడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ జట్టు 5 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది.



తన్మయ్ అగర్వాల్‌తో పాటు రాహుల్ రాధేశ్ (22) క్రీజ్‌లో ఉన్నారు. హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో అభిరథ్ రెడ్డి 35, రోహిత్ రాయుడు 0, కొడిమెల హిమతేజ 26, రాహుల్ సింగ్ 1, కే నితేశ్ రెడ్డి 22 పరుగులు చేసి ఔటయ్యారు. ఆంధ్ర బౌలర్లలో త్రిపురణ విజయ్ మూడు వికెట్లు పడగొట్టగా.. లలిత్ మోహన్, యారా సందీప్ తలో వికెట్ దక్కించుకున్నారు.కాగా, ప్రస్తుత రంజీ సీజన్‌లో ఆంధ్ర, హైదరాబాద్ జట్లు ఎలైట్ గ్రూప్-బిలో ఉన్నాయి. ఈ గ్రూప్‌లో హైదరాబాద్ ఆరో స్థానంలో ఉండగా.. ఆంధ్ర జట్టు ఆఖరిదైన ఎనిమిదో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌ల్లో ఓ మ్యాచ్‌లో గెలిచి, 2 మ్యాచ్‌ల్లో ఓటమిపాలై, ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకోగా.. ఆంధ్ర ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌ల్లో మూడు పరాజయాలు ఎదుర్కొని, ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.

# న్యూజిలాండ్‌తో తొలి వన్డే..

మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో ఇవాళ (నవంబర్ 13) జరుగుతున్న తొలి మ్యాచ్‌లో శ్రీలంక జట్టు భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ అవిష్క ఫెర్నాండో (115 బంతుల్లో 100బీ 9 ఫోర్లు, 2 సిక్సర్లు), వన్‌డౌన్ బ్యాటర్ కుసాల్ మెండిస్ (128 బంతుల్లో 143బీ 17 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో కదంతొక్కారు. శ్రీలంక స్కోర్ 324/5 (49.2 ఓవర్లు) వద్ద నుండగా వర్షం అంతరాయం కలిగించింది. లంక ఇన్నింగ్స్‌లో మరో నాలుగు బంతులు మాత్రమే మిగిలి ఉన్నాయి.

శ్రీలంక వన్డేల్లో న్యూజిలాండ్‌పై 300 ప్లస్ స్కోర్ సాధించడం ఇది రెండో సారి మాత్రమే. 2019లో ఆ జట్టు 326 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో లంక బ్యాటర్లు కుసాల్ మెండిస్, అవిష్క ఫెర్నాండో రెండో వికెట్‌కు 206 పరుగులు జోడించారు. వన్డేల్లో న్యూజిలాండ్‌పై ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. న్యూజిలాండ్‌తో ఒకే వన్డేలో ఇద్దరు ఆటగాళ్లు సెంచరీలు చేయడం ఇది రెండోసారి. 2001లో షార్జాలో జరిగిన మ్యాచ్‌లో సనత్ జయసూర్య (107), మహేళ జయవర్ధనే (116) సెంచరీలు చేశారు.

మ్యాచ్ విషయానికొస్తే.. శ్రీలంక టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 17 పరుగులకే ఆ జట్టు ఓపెనర్ పథుమ్ నిస్సంక (12) వికెట్ కోల్పోయింది. ఆతర్వాత కుసాల్ మెండిస్, అవిష్క ఫెర్నాండో రెండో వికెట్‌కు 206 పరుగులు జోడించారు. సెంచరీ పూర్తైన వెంటనే అవిష్క ఔటయ్యాడు.



అనంతరం బరిలోకి దిగిన సదీర సమరవిక్రమ 5 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ బాట పట్టాడు. ఆతర్వాత బరిలోకి దిగిన కెప్టెన్ అసలంక వేగంగా 40 పరుగులు చేసి చివరి ఓవర్‌లో ఔటయ్యాడు. జనిత్ లియనాగే క్రీజ్‌లో ఉన్నాడు. కివీస్ బౌలర్లలో జాకబ్ డఫీ మూడు వికెట్లు పడగొట్టగా.. మైఖేల్ బ్రేస్‌వెల్, ఐష్ సోధి తలో వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ సిరీస్‌కు ముందు శ్రీలంక, న్యూజిలాండ్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరిగింది. ఈ సిరీస్ 1-1తో సమంగా ముగిసింది. తొలి మ్యాచ్‌లో శ్రీలంక ఏకపక్ష విజయం సాధించగా.. చివరి బంతి వరకు రసవత్తరంగా సాగిన రెండో టీ20లో న్యూజిలాండ్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 109 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని డిఫెండ్ చేసుకుంది.



# అగ్రస్థానాల్లో పాకిస్తాన్ ఆటగాళ్లు!

ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్ ఆటగాళ్లు సత్తా చాటారు. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. అఫ్రిది ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో ఇరగదీశాడు. మూడు మ్యాచ్‌ల ఆ సిరీస్‌లో అఫ్రిది 12.62 సగటున ఎనిమిది వికెట్లు తీశాడు. తాజా ర్యాంకింగ్స్‌లో అఫ్రిది మూడు స్థానాలు ఎగబాకగా.. టాప్ ప్లేస్‌లో ఉండిన కేశవ్ మహారాజ్ రెండు స్థానాలు కోల్పోయి మూడో స్థానానికి పడిపోయాడు. ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.తాజా ర్యాంకింగ్స్‌లో అఫ్రిదితో పాటు అతని సహచరుడు హారీస్ రౌఫ్ కూడా భారీగా లబ్ది పొందాడు. ఆసీస్‌పై సంచలన ప్రదర్శనల (3 మ్యాచ్‌ల్లో 10 వికెట్లు) అనంతరం రౌఫ్ 14 స్థానాలు మెరుగుపర్చుకుని 13వ స్తానానికి ఎగబకాడు. అలాగే మరో పాక్ బౌలర్ నసీం షా కూడా ర్యాంకింగ్స్‌లో సత్తా చాటాడు. నసీం 14 స్థానాలు మెరుగుపర్చుకుని 55వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత్ నుంచి కుల్దీప్ యాదవ్ (4), జస్ప్రీత్ బుమ్రా (6), మొహమ్మద్ సిరాజ్ (7) టా-10లో ఉన్నారు.బ్యాటింగ్ విషయానికొస్తే.. పాక్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో బాబర్ 80 పరుగులు చేసి రెండు మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో షాహీన్ అఫ్రిది టాప్ ప్లేస్‌కు చేరడంతో బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో పాక్ ఆటగాళ్లే అగ్రస్థానాలను ఆక్రమించినట్లైంది. తాజా ర్యాంకింగ్స్‌లో ప్రస్తుత పాక్ కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ కూడా రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 23వ స్థానానికి చేరాడు. బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో 11 స్థానాలు మెరుగుపర్చుకుని 24వ స్థానానికి ఎగబాకాడు.

ఆల్‌రౌండర్ల విషయానికొస్తే.. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన మొహమ్మద్ నబీ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. జింబాబ్వే సికందర్ రజా రెండో స్థానంలో, రషీద్ ఖాన్ మూడో స్థానంలో ఉన్నారు. బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మెహిది హసన్ మీరాజ్ నాలుగు స్థానాలు మెరుగుపర్చుకుని నాలుగో స్థానానికి ఎగబాకాడు. భారత్ నుంచి రవీంద్ర జడేజా 14వ స్థానంలో ఉన్నాడు.